

మంత్రి స్వామి, సత్యలను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు



తూర్పునాయుడుపాలెం సభలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, వేదికపై మాగుంట, జనార్దన్, ఏలూరి, బాలాజీ, రియాజ్, విజయ్‌కుమార్, అశోక్‌రెడ్డి, ఉగ్ర, సత్య, లక్ష్మి

అఖండ స్వాగతం

మంత్రిగా జిల్లాకు తొలిసారి డాక్టర్ స్వామి రాక

ఒంగోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి జిల్లాకు ఆదివారం వచ్చిన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి టీడీపీ శ్రేణులు, అభిమానులు అఖండ స్వాగతం పలికారు. ఉమ్మడి జిల్లా సరిహద్దు బొప్పూడి నుంచి స్వామి స్వగ్రామమైన నాయుడుపాలెం వరకు వందలాది వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. సుమారు ఐదు గంటలపాటు ఈ ర్యాలీ జరిగింది. పలుచోట్ల గజమాలలు, బాణసంచా మోతలు, ఇతర రూపాల్లో సంబరాలతో కోలాహలంగా సాగింది. కొండపి నుంచి వరుసగా మూడోసారి విజయం సాధించిన డాక్టర్ స్వామికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కేబినెట్‌లో స్థానం కల్పించారు. అనంతరం ఆయనకు కీలకమైన సాంఘిక సంక్షేమశాఖను కేటాయించారు. ఈనెల 12న కేసరపల్లి వద్ద సభలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ స్వామి అప్పటి నుంచి విజయవాడలోనే ఉన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లాకు వచ్చారు. మధ్యాహ్నం తర్వాత కొండపి నియోజకవర్గంలో తనకు పార్టీ పరంగా, ఆర్థికపరంగా అన్నీ చూస్తున్న టీడీపీ యువనేత దామచర్ల సత్యతో కలిసి విజయవాడ నుంచి బయల్దేరిన స్వామి మూడు గంటలకు ఉమ్మడి జిల్లా సరిహద్దు బొప్పూడి వద్దకు చేరుకున్నారు. కొండపి నియోజకవర్గంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు, అభిమానులు వారికి అఖండ స్వాగతం పలికారు. మంత్రి స్వామి, సత్యలతోపాటు టీడీపీ సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు దంపతులు అక్కడి ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బయల్దేరి జిల్లా సరిహద్దు అయిన గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్దకు సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో చేరుకున్న స్వామికి సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆ నియోజకవర్గానికి చెందిన మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు నేతృత్వంలో పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలు తరలివచ్చి గజమాలతో సత్కరించారు. అనంతరం ఆరు గంటలకు ఒంగోలు నగరంలోకి మంత్రి స్వామి, సత్యలు ఓపెన్ టాప్ జీపులో చేరుకోగా పెద్దఎత్తున యువకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పాత బైపాస్ రోడ్డు మార్గాన కాన్వాయ్ రాగా మంగమ్మకాలేజీ జంక్షన్, మంగమూరు రోడ్డు, క్విస్ కాలేజీ, సౌత్ బైపాస్ జంక్షన్ల వద్ద వందలాది మంది టీడీపీ శ్రేణులు అభిమానులు, వచ్చి గజమాలలతో సత్కరించారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి కోలాహలంగా ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి వల్లూరు చేరుకొని వల్లూరమ్మ దేవాలయంలో పూజలు చేసిన మంత్రి స్వామి, సత్యలు తర్వాత సూరారెడ్డిపాలెం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, నాయుడుపాలెంలోని అంబేడ్కర్, ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాయుడుపాలెంలో నీరాజనం

స్వగ్రామమైన నాయుడుపాలేనికి మంత్రి హోదాలో వచ్చిన స్వామికి గ్రామస్థులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి డాక్టర్ స్వామి, ఆ గ్రామస్థుడైన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లకు గ్రామస్థులు అభినందన సభ నిర్వహించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బీఎన్ విజయకుమార్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం, దర్శి ఇన్‌చార్జిలు గూడూరి ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బాలాజీ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్, పలువురు జిల్లా ముఖ్యనేతలు సభలో పాల్గొన్నారు. కాగా టీడీపీలో రాష్ట్రస్థాయిలో కీలకంగా పనిచేస్తూ పార్టీ కొండపి నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న యువనేత దామచర్ల సత్య ఆధ్వర్యంలో ర్యాలీ, స్వగ్రామంలో అభినందన సభ అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ముఖ్యనేతలు, అన్ని గ్రామాల నుంచి టీడీపీ కార్యకర్తలు, అభిమానులతోపాటు ఇతర నియోజకవర్గాలకు చెందిన అనేక మంది ముఖ్యనాయకులు వేలాదిగా హాజరయ్యారు.

బొప్పూడి నుంచి నాయుడుపాలెం వరకు కోలాహలంగా ర్యాలీ
పెద్దఎత్తున తరలివచ్చిన అభిమానులు
పలుచోట్ల గజమాలలు, బాణసంచా మోతలు
దేవాలయాల్లో పూజలు, అంబేడ్కర్, ఎన్టీఆర్, ఆంజనేయుల విగ్రహాలకు నివాళులు
స్వగ్రామం నాయుడుపాలెంలో సత్కారం
హాజరైన ఉమ్మడి జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు
యువనేత దామచర్ల సత్య నేతృత్వంలో అట్టహాసంగా కార్యక్రమం



స్వామికి స్వాగతం పలుకుతున్న శ్రేణులు

కాలువ కట్టి.. కనికట్టు చేసి..

రూ.5 కోట్ల ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలు
తీరు మార్చుకోని వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి
పలుమార్లు అడ్డుకున్నా ఆగని ఆక్రమణ

లోపలి పేజీల్లో...



ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమంచి చేస్తున్న నిర్మాణం ఇదే

ఎమ్మెల్యేల చేతుల మీదుగా స్టూడెంట్ కిట్లు

ఒంగోలు (విద్య), జూన్ 16 : ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న స్టూడెంట్ కిట్స్‌ను స్థానిక శాసనసభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. ఈమేరకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశించారు. ఈనెల 20నుంచి 22వతేదీలోపు పూర్తి స్థాయిలో బ్యాగులు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, షూలు, బెల్టులు పాఠశాలలకు అందనున్నాయి. ఆ తర్వాత ఎమ్మెల్యే చేతుల మీదుగా ఈకిట్‌లను పంపిణీ చేయించనున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాత లోగో ఉన్న పుస్తకాలు కానీ, బ్యాగులు కానీ అనుమతించరాదని పీడీ సూచించారు.

మండిన ఎండ

ఒంగోలులో 40.1డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
తల్లడిల్లిన ప్రజానీకం

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 16 : జిల్లాలో మరోసారి ఎండ మండింది. పక్షం రోజుల క్రితం వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే నాలుగైదు రోజుల నుంచి క్రమంగా ఎండల తీవ్రత మళ్లీ పెరిగింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆదివారం 40.1 డిగ్రీలకు గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు తల్లడిల్లిపోయారు. ఉదయం 8గంటల నుంచే ఎండ తీవ్రతతోపాటు ఉక్కపోత అధికంగా ఉండటంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో నగరంలోని ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం ఆరు గంటల తర్వాత ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. నగరానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో జల్లులు పడటంతో ప్రజలకు ఉపశమనం లభించింది.



ఒంగోలులో ముసుగు వేసుకుని వెళ్తున్న యువతులు

కార్డుదారులకు కందిపప్పు, చక్కెర



కందిపప్పు, చక్కెర తూకంను పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

వచ్చేనెల నుంచి పంపిణీ
సీఎం చంద్రబాబు ఆదేశాలతో కదిలిన పౌరసరఫరాల శాఖ
ఎంఎల్‌ఎస్ పాయింట్లకు చేరిన సరుకులు
ప్యాకెట్లను తూకం వేసి పరిశీలించిన అధికారులు

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 16 : రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పును ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాదిగా కందిపప్పు పంపిణీని నిలిపివేసింది. దీంతో పేదలు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో ఈనెల 12వతేదీన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా కందిపప్పు ఇవ్వడం లేదన్న విషయం ఆయన దృష్టికి వెళ్లింది. సీఎం ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ అధికారులు కదిలారు. రాష్ట్రస్థాయిలో కందిపప్పును కొనుగోలు చేసి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు పంపారు. ఈనెల 20వతేదీ నుంచి రేషన్ షాపులకు బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లు, పంచదారను సరఫరా చేయాల్సి ఉంది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్లో దించిన చక్కెర, కందిపప్పు నాణ్యతతోపాటు అక్కడికి వచ్చిన ప్యాకెట్లను తూకం వేసి పరిశీలించారు. వచ్చే నెల 1 నుంచి వీటిని పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ అధికారులు ఎం.వి.సత్యనారాయణ, గంగాధర్, గోడౌన్ ఇన్‌చార్జి నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఊతకోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బడి బస్సులు భద్రమేనా?

42 శాతం వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్
మిగిలినవన్నీ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైకి
ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల నిర్లక్ష్యం
విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం
పట్టించుకోని రవాణాశాఖ అధికారులు

స్కూల్ బస్సులో పాటించాల్సిన జాగ్రత్తలు ఇవీ..

- ప్రతి బస్సు వెనుక, ఎడమవైపు విద్యా సంస్థ పేరు, పూర్తి చిరునామా, సెల్‌ఫోన్ నెంబర్ అందరికీ కనిపించేలా కచ్చితంగా రాయాలి.
- బస్సుకు అత్యవసర ద్వారం తప్పని సరిగా ఉండాలి. దానిపై ఆ విషయాన్ని స్పష్టంగా రాయాలి.
- డ్రైవర్‌కు లైసెన్స్‌తోపాటు కనీసం ఐదేళ్ల బస్సు నడిపిన అనుభవం ఉండాలి. వయసు 50 సంవత్సరాలకు మించి ఉండకూడదు. ఎప్పటికప్పుడు డ్రైవర్ ఆరోగ్య పరిస్థితిని గమనించాలి.
- బస్సులో ఒక సహాయకుడికి విధిగా నియమించాలి.
- బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల పూర్తి వివరాలు ఉండాలి.
- అగ్నిప్రమాద నివారణ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలి.
- కిటికీలకు అద్దాలను ఏర్పాటు చేయాలి
- పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదు.



జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యజమానులు బస్సుల ఫిట్‌నెస్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న వారు విద్యార్థుల భద్రతను మాత్రం గాలికొదిలేస్తున్నారు. ఏటా పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి వాహనాలను ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిన వారు ఆ విషయాన్ని అసలు పట్టించుకోవడం లేదు. అనేక మంది కండిషన్‌లో లేని పాత బస్సులను రోడ్లపై తిప్పుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. జిల్లాలో మొత్తం 1,541 బస్సులు ఉంటే ఇప్పటి వరకూ కేవలం 649కి మాత్రమే ఫిట్‌నెస్ చేయించుకున్నారు. ఆర్టీఏ అధికారులు కూడా ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

ఒంగోలు (క్రైం), జూన్ 16 : విద్యా సంస్థలు పునఃప్రారంభమయ్యాయి. ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు బస్సుల్లో వచ్చిపోతుంటారు. ఇందుకు ఏడాదికి రూ.10వేల వరకూ యజమానులు వసూలు చేస్తున్నారు. అయితే ఆ వాహనాలు ఎంత భద్రంగా ఉన్నాయోనన్న ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొంది. నిబంధనల ప్రకారం పాఠశాలల యాజమాన్యాలు ఏడాదికి ఒకసారి బస్సును రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ చేయించుకోవాలి. ఆతర్వాతనే రోడ్లమీద తిప్పాలి.

58శాతం బస్సులకు ఫిట్‌నెస్ లేదు!

పాఠశాలలు పునఃప్రారంభం నాటికి బస్సులన్నీ ఫిట్‌నెస్ చేయించుకొని రోడ్లమీదకు రావాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రైవేటు స్కూళ్లకు సంబంధించి 1,541 బస్సులుండగా వాటిలో ఈ ఏడాది ఇప్పటి వరకూ కేవలం 649మాత్రమే ఫిట్‌నెస్ చేయించుకున్నాయి. మిగిలిన 892 బస్సులు ఎలాంటి తనిఖీలు చేయించుకోకుండానే రోడ్లపై తిరుగుతున్నాయి. ఒంగోలు డీటీసీ కార్యాలయం పరిధిలో 832 బస్సులకు గాను 467 వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్ చేయించారు. 365 పెండింగ్‌లో ఉన్నాయి. దర్శి కార్యాలయం పరిధిలో 300 బస్సులుండగా 67కు మాత్రమే ఫిట్‌నెస్ చేయించారు. 233 బస్సులు ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్నాయి. మార్కాపురం ఆర్టీవో కార్యాలయం పరిధిలో 409 బస్సులు ఉండగా 115 ఫిట్‌నెస్ చేయించుకోగా, 294 వాహనాలు ఎలాంటి సర్టిఫికెట్ లేకుండానే తిరుగుతున్నాయి.

ఆటోల్లో ప్రమాదభరిత ప్రయాణం

కొందరు తల్లిదండ్రులు పాఠశాలలకు ఆటోలలో పిల్లలను పంపుతున్నారు. వాటికి సరైన భద్రత లేదు. కిక్కిరిసినట్లు ఆటోల్లో ఎక్కిస్తున్నారు. ఆటోలపైన బ్యాగ్‌లు వేలాడదీస్తున్నారు. డ్రైవర్లు కూడా పిల్లలు ప్రశాంతంగా కూర్చునేందుకు అవకాశం లేకుండా ఎక్కువ మందిని ఎక్కిస్తున్నారు. అసలు వాటిలో భద్రత కన్పించడం లేదు. అయినా తల్లిదండ్రులు స్కూల్ బస్సు ఫీజుల మోతను తట్టుకోలేక ఆటోల్లోనే పంపుతున్నారు.

అధికారుల ఉదాసీనత

స్కూల్ బస్సు రవాణా శాఖ ప్రమాణాలకు తగ్గట్టుగా ఉందా? లేదా? అనేది చూసిన తరువాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలి. కానీ పట్టుమని పది నిమిషాల్లో బస్సు ఫిట్‌నెస్ చూసి పంపిస్తున్నారు. ఆ సమయంలో డ్రైవర్ ఫిట్‌నెస్‌ను కూడా చూడాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. నిబంధనల ప్రకారం డ్రైవర్‌కు 50 ఏళ్ల పైబడి వయస్సు ఉండకూడదు. కంటిచూపు సరిగా ఉందా, లేదా అనేది పరీక్ష చేయాలి. ఆరునెలలకు ఒకసారి డ్రైవర్‌కు అన్ని వైద్య పరీక్షలు చేయించాలి. ఆ రిపోర్టులను ఆర్టీఏ అధికారులు చూడాలి. కానీ అలాంటిదేమీ జరగడం లేదు.

ఫిట్‌నెస్ లేకుండా రోడ్ల మీదకు వస్తే కేసులు

సుశీల, డీటీసీ

పాఠశాల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా రోడ్లమీదకు వస్తే కేసులు నమోదు చేస్తాం. ఈనెల 12 నుంచి ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేయిస్తున్నాం. పాఠశాలల యాజమాన్యాలు వెంటనే బస్సులను ఫిట్‌నెస్ చేయించుకోవాలి.

వైసీపీ దుష్టపాలన అంతం కోసమే ప్రజల మొక్కులు

ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్
తిరుమలకు టీడీపీ నేత ఇంటూరి పాదయాత్ర



శ్రీనివాసరావు చేపట్టిన పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల, విజయ్‌కుమార్



పోతవరంలో సురేష్ పాదయాత్రను ప్రారంభిస్తున్న వీరయ్యచౌదరి

నాగులుప్పలపాడు, జూన్ 16 : గత వైసీపీ ప్రభుత్వం సాగించిన దుష్ట పాలన అంతమై టీడీపీ కూటమి విజయం సాధించాలని ప్రజలు, నాయకులు ముక్కోటి దేవుళ్ళకు మొక్కుకున్నారని ఒంగోలు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చేకూరపాడు గ్రామానికి చెందిన సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు టీడీపీ విజయంపై తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వద్దకు పాదయాత్ర చేసేందుకు మొక్కుకున్నారు. ఈక్రమంలో ఆదివారం ఇంటూరి తిరుమలకు చేపట్టిన పాదయాత్రను ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ళు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించిందన్నారు. నిత్యం దోచుకోని దాచుకోవడమే ధ్యేయంగా నాటి మంత్రులు, ఎమ్మెల్యేలు పని చేశారని, రాష్ట్రానికి రాజధాని సైతం లేకుండా దిక్కులేనిదిగా చేసిన పాపం వల్ల ప్రజల ఆగ్రహానికి గురయ్యారని చెప్పారు. ప్రజలందరూ వైసీపీ ప్రభుత్వానికి సార్వత్రిక ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. ప్రజలు టీడీపీ కూటమికి పట్టం కట్టారని, విజనరీ కల్గిన సీఎం చంద్రబాబునాయుడుపై నమ్మకంతో మద్దతు తెలిపారని తెలిపారు. రాష్ట్రాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసి ప్రజల భవిష్యత్‌కు భరోసా కల్పిస్తామన్నారు. సీఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు తీసుకున్న వెంటనే ప్రజల భవిష్యత్ కోసం ఐదు సంతకాలను చేసి వాటి అమలు పరచే దిశగా కసరత్తు చేయడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. టీడీపీ కూటమి గెలుపుకోసం అనేక మంది దేవుళ్ళను మొక్కుకున్న ప్రజలు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎంతో సంతోషంగా పాదయాత్రగా మొక్కులు చెల్లించుకునేందుకు వెళుతుండడం అభినందనీయమన్నారు. తొలుత గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం పోతవరం గ్రామానికి చెందిన రాయపాటి సురేష్ తిరుమలకు చేపట్టిన పాదయాత్రను ఎమ్మెల్యేలు దామచర్ల, విజయ్‌కుమార్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి జెండాఊపి ప్రారంబించారు. కార్యక్రమంలో తేళ్ళ మనోజ్ కుమార్, లక్ష్మీవరప్రసాద్, మండవ జయంత్‌బాబు, గుమ్మడి సాయిబాబా, ఢాకా శ్రీ నివాసరెడ్డి, పున్నారెడ్డి , సర్పంచ్‌లు కొమ్మినేని రమేష్‌బాబు, బాలకోటి, కోమ్మాలపాటి సురేష్, కరణం మోహన్, షేక్ ఖాజావలి, పెనుబోతు సునీల్, నెప్పల శివకృష్ణ, దివి పున్నారావు, గూడూరు ఝాన్సీ, వెంకి, శరత్, నార్నె అంజయ్య, శేషారావు, పొద వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రాంటును వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న కాంతారావు

ఒంగోలు(విద్య), జూన్ 16 : పాఠశాల నిర్వహణ గ్రాంటు, స్కూలు కాంప్లెక్స్ గ్రాంటులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో వెంటనే విడుదల చేయాలని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు టీపీఎల్.కాంతారావు కోరారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉన్నత పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని, హైస్కూలు ప్లస్ పాఠశాలలో నిర్వహణకు ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలని, పాఠశాలల్లో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని కోరారు. నాడు-నేడు పనుల నిర్వహణ నుంచి ప్రధానోపాధ్యాయులను మినహాయించాలన్నారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌కు, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామిలకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి వై.వెంకట్రావు, కోశాధికారి జీఎస్ఆర్.సాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీవీ.సుబ్రహ్మణ్యం, ఆడిట్ కమిటీ సభ్యులు సీహెచ్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

ఒంగోలు(విద్య), జూన్ 16 : జాతీయ ఉపకార వేతన పరీక్ష నేషనల్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి అని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ సీడింగ్ అయిన బ్యాంకు ఖాతాలకు మాత్రమే ఉపకార వేతనం నగదు జమ అవుతుంది. 2019, 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఈ ఉపకార వేతనానికి ఎంపికై ప్రస్తుతం 9నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలన్నారు. స్కాలర్‌షిప్ పోర్టర్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్నా, రెన్యువల్ చేసినా బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోతే నగదు జమ కాదన్నారు. ప్రస్తుతం ఉపకార వేతనం నగదు జమకాని విద్యార్థుల పేర్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. తమ బ్యాంకు ఖాతాలకు నగదు జమకాని విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ వివరాలు చూసుకొని తమ బ్యాంకు జాబితాలకు ఆధార్ సీడింగ్ చేయించి డైరెక్ట బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ జరిగేలా ఏర్పాటు చేసుకోవాలని డీఈవో కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

నాగులుప్పలపాడు, జూన్ 16 : మన ఊరు మన ఈదుముడి సేవా సంస్థ వ్యవస్థాపకుడు కావూరి వాసు ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు శ్రీరామ్ మల్టీస్పెషాలిటీ వైద్యశాల సహకారంతో ఈదుముడి గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆసపత్రి అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ, వైద్యులు చంద్రమౌళి, మౌనికారెడ్డి, కుట్టుబోయిన వెంకటేష్, సరయు, పల్లవి సుమారు 130మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యశాల మేనేజర్ ఎస్.నాగరాజు, జి.పున్నయ్య, చిరంజీవి, శ్యాంకుమార్, సభ్యులు మేడా బ్రహ్మయ్య ఉప్పల వెంకట్రామయ్య, ప్రసాదు, కుర్రా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డిప్లమో కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16: వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీలో డిప్లమో కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న యువతీ, యువకులు ఈనెల 20లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు బి.ఉదయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, పదో తరగతితో పాటు ఐటీఐ రెండేళ్ళ పాటు ఉత్తీర్ణులైన విద్యార్థులకు నేరుగా డిప్లమో ద్వితీయ సంవత్సరం ప్రవేశం ఉంటుందన్నారు. ప్రథమ సంవత్సరంలో నెలకు రూ.వెయ్యి, ద్వితీయ సంవత్సరంలో రూ.1100, తృతీయ సంవత్సరంలో రూ.1200 చొప్పున ఉపకార వేతనం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9648483727 సెల్‌నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

కాలువ కట్టి..కనికట్టు చేసి..!

రూ.5కోట్ల ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలు ● తీరు మార్చుకోని వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి ● పలుమార్లు అడ్డుకున్నా ఆగని ఆక్రమణ



ఆక్రమణ చెరలో ఉన్న రోడ్డు పక్కన ఉన్న స్థలం

మార్కాపురం, జూన్ 16: ఒకటికాదు.. రెండుకాదు.. ఇప్పటి వరకు ఐదుసార్లు.. రూ.కోట్లు విలువైన ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు వైసీపీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి ప్రయత్నించారు. గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణను నిలిపిశారు. అయినప్పటికీ, నాడు అధికారం అండ ఉన్న ఆ నాయకుడు మాత్రం తన పట్టు విడవలేదు. తన భూమికి ముందున్న ఆర్అండ్‌బీ స్థలాన్ని ఎలాగైనా కొట్టేయాలని కొత్త ప్రణాళిక వేశాడు. పంచాయతీ నిధులతో రెండు స్థలాల మధ్య కాలువ కట్టి ఆర్అండ్‌బీ స్థలాన్ని వదిలేస్తున్నట్లు గ్రామస్థులను నమ్మించాడు. అంతలోనే రూ.కోట్ల విలువచేసే ఆర్అండ్‌బీ స్థలాన్ని ప్రస్తుతం చదునుచేసి కొట్టేసేందుకు వేగంగా నిర్మాణాలు చేస్తున్నాడు. అడ్డుకోవాల్సిన అధికారులు జేబులు తడుపుకొని చోద్యం చూస్తున్నారు.

గుట్టుగా ఆక్రమించేందుకు యత్నం..

మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలో 856 సర్వే నెంబర్‌లో 3.01 ఎకరాల భూమి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సంబందించి ఉంది. ఆ సర్వే నెంబర్‌లో 300 మీటర్ల మేర రోడ్డు ఉంది. కానీ ఎస్సీ కాలనీ సమీపానికి వచ్చేసరికి 50 సెంట్ల భూమి వ్యవసాయ భూములవైపు ఖాళీగా ఉంది. దరిమడుగు గ్రామ సమీపంలో భూములకు గతంలో పెద్దగా ధరలు లేవు. కానీ 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్‌హెచ్ 565 జాతీయ రహదారిని మంజూరు చేయించి పనులు ప్రారంభించింది. దీంతో ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇదే అదునుగా ఆర్అండ్‌బీ స్థలాన్ని ఎలాగైనా కొట్టేయాలని సదరు వైసీపీ మండల ప్రజాప్రతినిధి పక్కనేవున్న భూమిని కొనుగోలు చేశాడు. జాతీయ రహదారి నిర్మాణం పూర్తైన తర్వాత ఒకసారి ఆర్అండ్‌బీ స్థలాన్ని చదునుచేసి ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. టీడీపీ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు నిశబ్ధంగా ఉన్న సదరు నేత వైసీపీ అధికారంలోకి రావడంతో ఒక కొత్త ప్రణాళిక వేశాడు. తన భూమికి ఆర్అండ్‌బీ స్థలానికి మధ్యన పంచాయతీ నిధులతో మురుగు కాలువ నిర్మించాడు. అధికారం అండ ఉండడంతో కాలువ నిర్మాణంలోనే సుమారు 20 సెంట్ల మేర ఆర్అండ్‌బీ స్థలాన్ని తన భూమిలో కలిపేసుకున్నాడు. కొన్నాళ్లపాటు దాన్ని పట్టించుకోలేదు. ఇటీవల అక్కడ ఒక ట్రాక్టర్ షోరూం నిర్మించేందుకు ముందుగా తన భూమిలో నిర్మాణాన్ని ప్రారంభించాడు. ప్రస్తుతం మురుగు కాలువదాటి ఆర్అండ్‌బీ స్థలాన్ని కూడా ఆక్రమించేశాడు. నిర్మాణాలు పూర్తి చేస్తే తనను ఎవరూ పట్టించుకోరనే ధీమాతో హడావుడిగా పనులు చేస్తున్నాడు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని వైసీపీ నాయకుడు కాజేస్తున్నా.., అధికార యంత్రాంగం మాత్రం చక్కగా జేబులు నింపుకొని చోద్యం చూస్తోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆర్అండ్‌బీ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రను ప్రారంభిస్తున్న నిర్వాహకులు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), జూన్ 16 : విశ్వహిందూ పరిషత్, వివిధ హిందూ ధర్మ సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలులో ఆదివారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక సంతపేట శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం నుంచి బయలుదేరిన శోభాయాత్ర కేశవస్వామిపేటలోని వీరాంజనేయస్వామి దేవస్థానం వరకు కొనసాగింది. ఈ శోభాయాత్రలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరయ్యారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రముఖ్ సోమసుబ్బారావు, రమణగుప్త, భజరంగ్‌దళ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పల్లామల్లిలో వైభవంగా సాయిసత్సంగం



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

చీమకుర్తి, జూన్16 : చీమకుర్తి మండలం పల్లామల్లి గ్రామంలో ఆదివారం సాయిసత్సంగ కేంద్రం వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గత రెండురోజుల నుంచి సాయిసత్సంగ కేంద్రంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విశేష పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ,యువతీ,యువకులచే నిర్వహించిన భక్తిపూర్వక సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయిబాబా, బాబుజీ గురూజీల చిత్రపటాలతో నిర్వహించిన గ్రామోత్సవంలో చుట్టుపక్కల నుంచి సైతం మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొనటం విశేషం. కమిటీ వారిచే అన్నదానాన్ని నిర్వహించారు.

24నుంచి డీఈఎల్‌ఈడీ పరీక్షలు

ఒంగోలు(విద్య), జూన్ 16: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషనల్ (డీఈఎల్ఈడీ) 2022-24 బ్యాచ్ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24నుంచి 27వ తేదీ వరకు షైనంపాడులోని జిల్లా విద్యా శిక్షణా సంస్థలో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 9నుంచి 11.30 గంటల వరకు జరుగుతాయన్నారు. హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

పేస్ అధ్యాపకుడికి డాక్టరేట్

ఒంగోలు(విద్య), జూన్ 16: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన ఎం.జానకిరామకు రాయలసీమ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. డాక్టర్ సర్దార్ గిగ్గోత్ మార్గదర్శకత్వంలో ఎ స్టడీ ఆన్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఆఫ్ హోటల్ ఇండస్ట్రీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జానకిరామ్‌ను కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డైరెక్టర్ టి.రామచైతన్య, డీన్ ఎం.అప్పారావు, ఎంబీఏ విభాగాధిపతి టి.మేరీ జోన్స్, అధ్యాపకులు అభినందించినట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



జానకిరామ్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్

జిల్లాలో గోవధ నిషేధ చట్టం అమలు

● ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు(క్రైం), జూన్ 16: సత్యం, త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, అలాంటి పండుగను ప్రశాంత వాతావరణంలో ముస్లింలు జరుపుకోవాలని అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు ఆదివారం పిలుపునిచ్చారు. సోమవారం బక్రీద్ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా గోవధ నిషేధ చట్టం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గోవుల అక్రమ తరలింపును అడ్డుకునేందుకు 18 చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేశామని, ఎవరైనా గోవధకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టింగ్‌లు పెట్టకూడదని హితవు పలికారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే 100,112 టోల్‌ఫ్రీ నంబర్లు, అలాగే 9121102266 సెల్ నంబర్లకు సమాచారం అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసు వారికి సహకరించాలని ఆయన కోరారు.

వైసీపీ నాయకులపై టీడీపీ శ్రేణుల ఫిర్యాదు

చీమకుర్తి, జూన్16 : టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన విషయంలో బాధ్యులైన వైసీపీ నాయకులపై కేసు నమోదు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు గొల్లపూడి సుబ్బారావు, ముప్పూరి చలమయ్య ఆదివారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ హయాంలో స్థానిక బైపాస్‌రోడ్ నిర్మాణానికి ఆనాటి మంత్రి శిద్దా రాఘవరావు చేతులమీదుగా ప్రారంభించిన శిలాఫలకం, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భవన నిర్మాణ శిలాఫలకం, టిడ్కో గృహాల శిలాఫలకాలను ధ్వంసం చేసేందుకు కారణమైన బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి తదితరులపై కేసు నమోదు చేయాలని తమ ఫిర్యాదులో కోరారు. దీనిపై సీఐ దుర్గాప్రసాద్ స్పందిస్తూ టీడీపీ, వైసీపీ నాయకులు ఇచ్చిన పరస్పర ఫిర్యాదులపై విచారణ జరిపిన తర్వాతనే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటి వరకూ ఎవరిపైనా కూడా కేసులు నమోదు చేయలేదని ఆయన తెలిపారు.

18మంది రక్తదానం



రక్తదాతకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 16: ఒంగోలులోని సురక్ష అపార్ట్‌మెంట్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అపార్ట్‌మెంట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆడిటర్ మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 18 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సురేష్, రాఘవ, మంగళగిరి నరసింహారావు, సభ్యులు శ్రీదేవి, సుజాత, శ్రీనివాస్, సంతోష్, సింధూర పాల్గొన్నారు.

గోవధపై నిషేధం : కమిషనర్

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 16: బక్రీద్ పండుగ సందర్భంగా నగరంలో గోవధ నిషేధించినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు ఆదివారం తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం గోవధ, మాంసం విక్రయాలు, ఉచిత పంపిణీలు చేయకూడదని ఆయన పేర్కొన్నారు. దీనిపై కార్పొరేషన్ యంత్రాంగం దృష్టి సారించిందని, ఎవరైన ఆదేశాలు అతిక్రమిస్తే గోవధ నిషేధిత చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ముగిసిన వర్క్‌షాప్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16: ఒంగోలు నగరంలోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న గూగుల్ ఆండ్రాయిడ్ టెక్ క్యాంప్ వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. ఎడ్యుస్కిల్స్ సంస్థ ప్రతినిధి పవన్‌కుమార్ హాజరై విద్యార్థులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ రూప అక్కేష్, ఆర్.వీరాంజనేయులు, ఒ.రామచైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లాలోని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

24నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16: ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 24వ తేదీ నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలు అర్హులన్నారు. 18నుంచి 45 ఏళ్ళ మధ్య వయస్సు ఉండి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ శిక్షణతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9573363141 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకుడు



ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో తలనీలాలు సమర్పిస్తున్న తిరుపతిరావు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 16 : ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించాలని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్ గెలవడంతో 8వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు భైరపనేని తిరుపతిరావు మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం స్థానిక కమ్మపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన తలనీలాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం మూడు సంవత్సరాల నాటి మొక్కు తీర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంద్రపాటి వర్ష్‌వర్ష్, దాచర్ల వెంకటరమణయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా టీడీపీ విజయోత్సవ ర్యాలీలు



గాడిపర్తివారిపాలెంలో వేడుకలు



హిమగిరికాలనీలో కేక్ కటింగ్

చీమకుర్తి, జూన్16 : తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పలుచోట్ల విజయోత్సవ ర్యాలీలు అట్టహాసంగా జరిపారు. మండలపరిధిలోని గాడిపర్తివారిపాలెం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో నాయకులు గమిని ప్రసాద్, జ్యోతి వేణు, గమిని కృష్ణారావు, గంగినేని సుధాకర్‌రావు, మండలపు రామాంజనేయులు, నారిపెద్ది లక్ష్మీనారాయణ, గమిని ఆంజనేయులు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. చీమకుర్తి మున్సిపల్ పరిధిలోని హిమగిరికాలనీలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గొల్లపూడి శ్రీహరి, ముప్పూరి చలమయ్య, ఎస్‌కే.జానీ, తోపూరి శ్రీనివాసులు, అనిల్, అశోక్‌కుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

టీసీసీకి 1లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలకు జూలై 1 వతేదీలోపు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు రూ.150 చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల సహాయ క మిషనర్ శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.50రుసుంతో 6వతేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్ష రాసేందుకు 42 రోజులు శిక్షణ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. పరీక్ష విశాఖపట్నం, కాకినాడు, గుంటూరు, కడప, అనంతపురంలో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

పంచాయతీరాజ్‌కు మహర్దశ

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16: ఉపముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్న పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్‌కు మహర్దశ కలుగుతుందని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి ఆదివారం ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు, పర్యావరణ పరిరక్షణలో అవగాహన ఉన్న పవన్‌కళ్యాణ్‌కు ఆ శాఖలను కేటాయించడం శుభపరిణామని పేర్కొన్నారు.

తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

దర్శి, జూన్ 16: మండలంలోని తొమ్మిది మంది ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారు. ఈమేరకు ఎంపీడీవో హనుమంతరావుకు ఆదివారం రాజీనామా పత్రాలను అందజేసినట్లు సమాచారం. తుమ్మెదలపాడు, తూర్పువీరాయపాలెం, బొట్లపాలెం, రాజంపల్లి, సామంతపూడి, తానంచింతల, బండి వెలిగండ్ల, చందలూరు, త్రిపురసుందరీపురం గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్వచ్ఛందంగా తప్పుకున్నారు.



మంత్రి డాక్టర్ స్వామి, దామచర్ల సత్యలకు స్వాగతం పలుకుతున్న నియోజకవర్గ నేతలు



వల్లూరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి స్వామి, సత్య, పలువురు నాయకులు

జిల్లా సమస్యలపై ప్రత్యేక దృష్టి

- వెలిగొండ పూర్తికి, సాగర్‌కాలువల పొడిగింపునకు కృషి
- పౌరసన్మాన సభలో మంత్రి స్వామి
- పాల్గొన్న పలువురు నేతలు
- నష్టపోయిన కార్యకర్తలకు బిల్లులు చెల్లిస్తాం
- జిల్లాలో జరిగిన అవినీతిపై విచారణ
- బాధ్యులపై చర్యలు





తూర్పునాయుడుపాలెంలో మంత్రి స్వామి, సత్యకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు, సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు

టంగుటూరు/కొండపి/సింగరాయకొండ, జూన్ 16 : జిల్లాలో ప్రధానమైన వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయడంతోపాటు, సాగర్‌కాలువల పొడిగింపు, రామాయపట్నం పోర్టుకు అనుసంధానంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. టంగుటూరు మండలంలోని సొంతగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో ఆదివారం రాత్రి జరిగిన పౌర సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ట్రిపుల్‌ఐటీ, నిమ్జ్ పూర్తికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో అక్రమ మైనింగ్ జరిగిందని, దీనిపై విచారణ చేయిస్తామని చెప్పారు. ప్రభుత్వాన్ని అవినీతి రహితంగా చంద్రబాబు సారథ్యంలో నడుపుతామన్నారు. జిల్లాలో వైసీపీ నాయకులు లెక్కలేనితనంగా చేసిన అవినీతిపై విచారణ చేయిస్తామన్నారు. గ్రామవలంటీర్లు అందరూ తమ పార్టీవారే అని వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డి చెబుతుంటే, ఇప్పుడు వలంటీర్లు తమ పోస్టులకు బలవంతంగా వైసీపీ నాయకులు రాజీనామా చేయించారంటూ తమకు మెసేజ్‌లు పెడుతున్నారన్నారు. అదేవిధంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు చేసి నష్టపోయిన కార్యకర్తల బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. తనను ఆదరించిన కొండపి నియోజకవర్గంలోని సంగమేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి చేయడంతోపాటు, మూసి, పాలేరులపై చెక్‌డ్యాంలు నిర్మిస్తామన్నారు. రెండు నెలలకోసారి జిల్లాశాసనసభ్యులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకం ఉంచి తనకు మంత్రి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, తనకు మంత్రి పదవి రావడానికి సహకరించిన జిల్లాలోని ప్రతి శాసనసభ్యుడికి, పార్టీ ఇన్‌చార్జిలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దామచర్ల కుటుంబం అండదండలతో తనకు మంత్రి పదవి రావడం ఆనందదాయకమన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ నిబద్ధతతో స్వామి పనిచేస్తున్నారని, అందువల్లనే మంత్రి పదవి దక్కిందని చెప్పారు.

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ తమ కుటుంబంతో అనుబంధం ఉన్న స్వామికి మంత్రి పదవి రావడం సంతోషకరమన్నారు. ప్రజలు టీడీపీకి అఖండ మెజార్టీ కట్టబెట్టారని, వారికి ఆకాంక్షలకు అనుగుణంగా తమపై బాధ్యతలు కూడా పెరిగాయని చెప్పారు. శాసనసభ్యులు, ఇన్‌చార్జిలు సమన్వయంతో సాగి జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బీఎన్.విజయ్‌కుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎం.ఎం.కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, నారాయణరెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, దర్శి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్, బీజేపీ జిల్లా నాయకుడు యోగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గుండపనేని అచ్యుత్‌కుమార్, నారపశెట్టి పాపారావు పాల్గొన్నారు. అనంతరం స్వామి, సత్యలను సన్మానించారు.

మంత్రి స్వామికి భారీ స్వాగతం

టంగుటూరు మండలంలోని తూర్పు నాయుడుపాలెంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగుల సంక్షేమం, గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల శాఖల మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. కొండపి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాకు తొలిసారిగా వస్తున్న స్వామికి స్వాగతం పలికేందుకు యావత్తు జిల్లాలోని టీడీపీ శ్రేణులు వెళ్లాయి. జిల్లాలోని పలు నియోజకవర్గాలతోపాటు, కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉమ్మడి ప్రకాశం జిల్లా సరిహద్దు వద్ద ఉన్న బొప్పూడి శ్రీ ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి తూర్పు నాయుడుపాలెం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధానంగా ఆరు మండలాల నుంచి దాదాపు 400లకు పైగా వాహనాల్లో కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఎదురెళ్లి మంత్రి స్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య, టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావులకు స్వాగతం పలికారు. దారిపొడవునా పార్టీ శ్రేణులు స్వాగతం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తూర్పు నాయుడుపాలెం బస్టాండ్ సెంటర్‌లోని దివంగత ఎన్టీఆర్, దివంగత దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడే ఉన్న శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా రామా గోపి ఆధ్వర్యంలో భారీ పూలదండను క్రేన్ సాయంతో స్వామి, సత్యలకు వేశారు. అనంతరం గ్రామంలో మంత్రి స్వామికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. శాలువాలు, బొకేలతో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో నేతలు గొర్రెపాటి రామయ్య చౌదరి, తానికొండ వెంకటేశ్వర్లు, చదలవాడ చంద్రశేఖర్, బెల్లం జయంత్‌బాబు, కామని విజయ్‌కుమార్, బెజవాడ వెంకటేశ్వర్లు, ఈదర ప్రభాకర్, పోకూరి రవీంద్రబాబు, పోటు శ్రీనివాసమురళి, ఏలూరి రాంబాబు, గాలి సందీప్, కొండ్రగుంట శ్రీనివాసరావు, అనుమోలు సాంబయ్య, అనుమోలు సుధాకర్, గుమ్మళ్ల వెంకటరావు, అనుమోలు రాజారమేష్, తాటికొండ మహేంద్ర, బోయపాటి రమణారెడ్డి, భూమిరెడ్డి వేణు, చాగంరెడ్డి నరసారెడ్డి, యర్రమోతు శ్రీనివాసరావు, రేగుల వీరనారాయణ, బొడ్డపాటి యల్లమంద నాయుడు, పోటు శ్రీనివాసరావు, మారెడ్డి సుబ్బారెడ్డి, కొమ్మాలపాటి రాఘవ, గోనుగుంట వున్నయ్యచౌదరి,



గ్రేత్ సెంటర్ వద్ద మంత్రి స్వామికి స్వాగతం పలుకుతున్న జయంత్‌బాబు

మూలె కోటేశ్వరరావు, మూలె రామిరెడ్డి, మారెడ్డి అబ్బిరెడ్డి, వేల్పుల సింగయ్య, గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, సవిడిబోయిన మురళి, పిగిలి హరికృష్ణ, కొత్తూరి రంగనాయకులు, కోట శ్రీనివాసులు, ఇమ్మడిశెట్టి రామారావు, మునగా సుబ్రహ్మణ్యం, పద్మనాభుని వెంకట సురేష్‌కుమార్, పాదర్తి కోటేశ్వరరావు, ఎంపీపీలు బెల్లం సత్యన్నారాయణ, కొండశింగు స్వప్నకుమారి, పార్టీ ఎస్సీసెల్ నాయకురాలు కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలువ కట్టి.. కనికట్టు చేసి..


ఆక్రమణ కోసం నిర్మించిన కాలువ

- రూ.5 కోట్ల ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలు
- తీరుమార్చుకోని వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి

మార్కాపురం, జూన్ 16: ఒకటికాదు రెండుకాదు ఇప్పటి వరకు ఐదుసార్లు రూ.కోట్లు విలువైన ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు వైసీపీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి ప్రయత్నించారు. గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయడం అక్రమాన్ని నిలిపిశాడు. అయినప్పటికీ, నాడు అధికారం అండ ఉన్న ఆ నాయకుడు మాత్రం తన పట్టు విడవలేదు. తన భూమికి ముందున్న ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఎలాగైనా కొట్టేయాలని కొత్త ప్రణాళిక వేశాడు. పంచాయతీ నిధులతో రెండు స్థలాల మధ్య కాలువ కట్టి ఆర్‌అండ్‌బీ స్థలాన్ని వదిలేస్తున్నట్లు గ్రామస్థులను నమ్మించాడు. అంతలోనే రూ.కోట్ల విలువచేసే ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ప్రస్తుతం చదునుచేసి కొట్టేసేందుకు వేగంగా నిర్మాణాలు చేస్తున్నాడు. అడ్డుకోవాల్సిన అధికారులు జేబులు తడుపుకొని చోద్యం చూస్తున్నారు.

గుట్టుగా ఆక్రమించేందుకు యత్నం

మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలో 856 సర్వే నెంబర్‌లో 3.01 ఎకరాల భూమి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సంబంధించి ఉంది. ఆ సర్వే నెంబర్‌లో 300 మీటర్ల మేర రోడ్డు ఉంది. కానీ ఎస్సీ కాలనీ సమీపానికి వచ్చేసరికి 50 సెంట్ల భూమి వ్యవసాయ భూములవైపు ఖాళీగా ఉంది. దరిమడుగు గ్రామ సమీపంలో భూములకు గతంలో పెద్దగా ధరలు లేవు. కానీ 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్‌హెచ్ 565 జాతీయ రహదారిని మంజూరు చేయించి పనులు ప్రారంభించింది. దీంతో ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇదే అదునుగా ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఎలాగైనా కొట్టేయాలని సదరు వైసీపీ మండల ప్రజాప్రతినిధి పక్కనేవున్న భూమిని కొనుగోలు చేశాడు. జాతీయ రహదారి నిర్మాణం పూర్తైన తర్వాత ఒకసారి ఆర్‌అండ్‌బీ స్థలాన్ని చదునుచేసి ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. టీడీపీ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు నిశబ్దంగా ఉన్న సదరు నేత వైసీపీ అధికారంలోకి రావడంతో ఒక కొత్త ప్రణాళిక వేశాడు. తన భూమికి ఆర్‌అండ్‌బీ స్థలానికి మధ్యన పంచాయతీ నిధులతో మురుగు కాలువ నిర్మించాడు. అధికారం అండ ఉండడంతో కాలువ నిర్మాణంలోనే సుమారు 20 సెంట్ల మేర ఆర్‌అండ్‌బీ స్థలాన్ని తన భూమిలో కలిపేసుకున్నాడు. కొన్నాళ్లపాటు దాన్ని పట్టించుకోలేదు. ఇటీవల అక్కడ ఒక ట్రాక్టర్ షోరూం నిర్మించేందుకు ముందుగా తన భూమిలో నిర్మాణాన్ని ప్రారంభించాడు. ప్రస్తుతం మురుగు కాలువదాటి ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కూడా ఆక్రమించేశాడు. నిర్మాణాలు పూర్తి చేస్తే తనను ఎవరూ పట్టించుకోరనే ధీమాతో హడావుడిగా పనులు చేస్తున్నాడు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని వైసీపీ నాయకుడు కాజేస్తున్నా.., అధికార యంత్రాంగం మాత్రం చక్కగా జేబులు నింపుకొని చోద్యం చూస్తోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రాయితీపై ఎరువులు, విత్తనాలు అందించాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

బేస్తవారపేట, జూన్16 : రైతులకు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలను 90శాతం రాయితీపై వెంటనే సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిద్దలూరు నియోజకవర్గ రైతు సంఘ సమితి సమావేశం బేస్తవారపేటలో ఆదివారం నిర్వహించారు. ఆ సమితి నియోజకవర్గ కార్యదర్శి డాకాల పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి వీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టం చేయాలని కోరారు. డాకాల పుల్లయ్య మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటిన రైతులకు రూ.10వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం పూర్తి చేయాలని, వెలిగొండ ప్రాజెక్టుకు నికరజలాలు విడుదల చేసి నిర్వాసితులకు ఆదుకోవాలని కోరారు. కంభం చెరువు కింద కాలువలకు పూడికలు తీయాలని, నియోజకవర్గంలోని చెరువులన్నిటికి మరమ్మతులు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఊరుమార్పు జోసఫ్, రైతు సంఘం అధ్యక్షులు జక్కా అంకయ్య, కంభం మండల నాయకులు వేల్పుల అంకయ్య, మోక్షగుండం రైతు సంఘం నాయకులు టి.రంగారెడ్డి, ఎం.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి చేయూత


సరుకులను అందిస్తున్న శరత్‌బాబు

కొమరోలు, జూన్ 16 : మండలంలోని సర్విరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుబ్బయ్య అనే దివ్యాంగునికి నెలకు సరిపడే నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేసినట్లు దివ్యహెల్పింగ్ సంస్థ నిర్వాహకులు లోక్కు శరత్‌బాబు తెలిపారు. మండలంలో నిరుపేదలకు తమ సంస్థ ద్వారా చేయూతనిస్తున్నామన్నారు. పేద దివ్యాంగుడైన సుబ్బయ్యకు ఇటీవలె కాళ్లుపూర్తిగా చచ్చుపడిపోవడంతో ఏ పని చేసుకొనే పరిస్థితి లేదన్నారు. వారికి నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో పలు సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా పేదలకు చేయుతనిచ్చేందుకు సహకరిస్తామన్నారు. త్వరలో కొమరోలు ప్రభుత్వ వైద్యశాలకు శీతల శవపేటికను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు కారుమంచి పీరయ్యకోనేటి ప్రాన్సీస్, స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రాంటును వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న కాంతారావు

ఒంగోలు(విద్య), జూన్ 16 : పాఠశాల నిర్వహణ గ్రాంటు, స్కూలు కాంప్లెక్స్ గ్రాంటులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో వెంటనే విడుదల చేయాలని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు టీఎల్.కాంతారావు కోరారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావే శంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉన్నత పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ను ని యమించాలని, హైస్కూలు ప్లస్ పాఠశాలలో నిర్వహణకు ప్రత్యేక గ్రాంటు విడు దల చేయాలని, పాఠశాలల్లో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని కోరారు. నాడు-నేడు పనుల నిర్వహణ నుంచి ప్రధానోపాధ్యాయులను మినహాయించాల న్నారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌కు, సాంఘిక సం క్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామిలకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి వై.వెంకట్రావు, కోశాధికారి జీఎస్‌ఆర్.సాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీవీ.సుబ్రహ్మణ్యం, ఆడిట్ కమిటీ సభ్యులు సీహెచ్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాంకుఖాతాకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

ఒంగోలు(విద్య), జూన్ 16 : జాతీయ ఉపకార వేతన పరీక్ష నేషనల్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి అని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ సీడింగ్ అయిన బ్యాంకు ఖాతాలకు మాత్రమే ఉపకార వేతనం నగదు జమ అవుతుంది. 2019, 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఈ ఉపకార వేతనానికి ఎంపికై ప్రస్తుతం 9నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలన్నారు. స్కాలర్‌షిప్ పోర్టర్ లో తమ వివరాలను నమోదు చేసుకున్నా, రెన్యువల్ చేసినా బ్యాంకు ఖాతాకు ఆ ధార్ అనుసంధానం కాకపోతే నగదు జమ కాదన్నారు. ప్రస్తుతం ఉపకార వేతనం నగదు జమకాని విద్యార్థుల పేర్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. తమ బ్యాంకు ఖాతాలకు నగదు జమకాని విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ వివరా లు చూసుకొని తమ బ్యాంకు జాబితాలకు ఆధార్ సీడింగ్ చేయించి డైరెక్టు బెనిఫి ట్ ట్రాన్స్‌ఫర్ జరిగేలా ఏర్పాటు చేసుకోవాలని డీఈవో కోరారు.

డిప్లమో కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16: వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీలో డిప్లొమో కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న యువతీ, యువకులు ఈనెల 20లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు బి.ఉదయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, పదో తరగతితో పాటు ఐటీఐ రెండేళ్ళ పాటు ఉత్తీర్ణులైన విద్యార్థు లకు నేరుగా డిప్లమో ద్వితీయ సంవత్సరం ప్రవేశం ఉంటుందన్నారు. ప్రథమ సంవత్సరంలో నెలకు రూ.వెయ్యి, ద్వితీయ సంవత్సరంలో రూ.1100, తృతీయ సంవత్సరంలో రూ.1200 చొప్పున ఉపకార వేతనం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9648483727 సెల్‌నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

24నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16: ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 24వ తేదీ నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాం త మహిళలు అర్హులన్నారు. 18నుంచి 45 ఏళ్ళ మధ్య వయస్సు ఉండి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ శిక్షణతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9573363141 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

బక్రీద్ శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసు లురెడ్డి జిల్లాలోని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి


హాజరైన కార్యకర్తలు

పొదిలి, జూన్ 16 : టీడీపీ గెలుపుకోసం పాటు పడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పొదిలి పట్టణంలో ఆదివారం పొదిలి, కొనకనమిట్ల మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి టీడీపీ కార్యకర్త, నాయకుని శ్రమ ఫలితమే ఈ అఖండ విజయమన్నారు. టీడీపీ విజయానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ విజయానికి కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని వారికి భవిష్యత్తులో అన్నివిధాలుగా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మార్కాపురం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేద్దా మన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, వార్డును అభి వృద్ధి పథంలో అందరం కలిసికట్టుగా నడిపిద్దామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టు కొనేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ పొదిలిలో తాగి నీటి సమస్యను త్వరితగతిన తీర్చాలని, వెలుగొండ జలాలను పొదిలి ప్రాంతానికి తీసుకురావాలని కోరారు. తప్పకుండా ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతుగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల మండలాల టీడీపీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, మోరబోయిన బాబురావు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు సర్వం సిద్ధం


ఈద్గాలో వేసిన చలువ పందిళ్లు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 16: బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు మార్కాపురం పట్టణంలో సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని కంభం రోడ్డులోని పెద్ద ఈద్గా, నాగులవరం రోడ్డు, తర్లుపాడు రోడ్లలోని ఈద్గాలలో ఈద్ నమాజ్ కోసం సిద్ధం చేశారు. ఈద్గాలలో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో షామియానాలు వేసి చలువ పందిళ్లు సిద్ధం చేశారు. బ్లీచింగ్ చల్లి నీటి వసతి కల్పించారు. బక్రీద్ నమాజ్‌ను సోమవారం ఉదయం 7 గంటలకు మసీదులలో, 9 గంటలకు ఈద్గాలలో నిర్వహించనున్నట్లు ముస్లిం మతపెద్దలు తెలిపారు. త్యాగానికి ప్రతిరూపంగా బక్రీద్ పర్వదినాన్ని సంతోషంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలకు దానధర్మాలు చేస్తూ ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు. మానవుల్లో త్యాగనిరతని వ్యాపింపజేయటమే బక్రీద్ పండుగ ఉద్దేశ్యమని కందుల తెలిపారు. సమైఖ్యత, మానవత్వం దిశగా అడుగులు వేయాలన్నారు. స్వార్థం, రాగద్వేషాలు వదిలిపెట్టి త్యాగగుణం పెరగాలన్నారు.

బురుజుపల్లెలో వైభవంగా ఆలయ వార్షికోత్సవం


ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూన్ 16 : మండలంలోని ముండ్లపాడు పంచాయతీ పరిధిలోని బురుజుపల్లె గ్రామంలోని శ్రీవరసిద్ధి వినాయక, అభయ ఆంజనేయ, షిరిడీ సాయిబాబా స్వామి వార్ల ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలు రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వార్షికోత్సవంలో పాల్గొన స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ఆయన ప్రారంభిచారు. పోటీలు గ్రామంలో కొనసాగుతున్నాయి. వార్షికోత్సవ వేడుకలకు ఇతర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడియం శేషగిరి, వెంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే బక్రీద్ శుభాకాంక్షలు

గిద్దలూరు టౌన్ : సోమవారం బక్రీద్ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలిపారు. త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



భారీగా పాల్గొన్న యువత, శోభాయాత్రను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), జూన్ 16 : విశ్వహిందూ పరిషత్, వివిధ హిందూ ధర్మ సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలులో ఆదివారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక సంతపేట శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం నుంచి బయలుదేరిన శోభాయాత్ర కేశవస్వామిపేటలోని వీరాంజనేయస్వామి దేవస్థానం వరకు కొనసాగింది. ఈ శోభాయాత్రలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రామనామం చేస్తూ పాల్గొన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రముఖ్ సోమసుబ్బారావు, రమణగుప్త, భజరంగ్‌దళ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కంభంలో రోడ్లపై ఆవులు, కుక్కల స్వైరవిహారం

- గ్రామంలో వదిలి సొమ్ము చేసుకుంటున్న పశువుల యజమానులు
- పట్టించుకోని పోలీసులు, అధికారులు


జాతీయ రహదారిపై అడ్డంగా పడుకున్న ఆవులు


విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు

కంభం, జూన్ 16 : జంట నగరాలుగా పిలువబడే కంభం, కందులాపురం ప్రధాన రహదారుల్లో వందల సంఖ్యలో ఆవులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆవులు రోడ్లకు అడ్డంగా నిలబడడం, పడుకోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా ఆవులు రోడ్లపై సంచరిస్తుంటే బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఆవు లను, ఎద్దులను దేవుని మొక్కుల పేరుతో కొనుగోలు చేసి వాటిని వదిలి వేస్తున్నారు. ఆవులు, ఎద్దులు వీధుల్లో సంచరిస్తున్నట్లు పలు వురు వాటికి పూజలు చేసి ఆహారం పెడుతుంటారు. దీనితో అవి తిని తిరుగుతుంటాయి. ప్రస్తుతం వాటి సంతతి పెరిగి ఎక్కువ జీవులయ్యాయి. పుట్టిన దూడలను వాటి యజమానులు తోలుకు పోయి మంచి రేట్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మిగిలిన వారు కూడా ఇది మంచి వ్యాపారంగా భావించి ఆవులను కొని వదిలి వేస్తున్నారు. ప్రస్తుతం 400కు పైగా ఆవులు, ఎద్దులు రోడ్లపై కనిపిస్తున్నాయి. వీటితో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మూడేళ్ల క్రితం ఇదే సమస్య వస్తే పోలీసులకు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి ఎస్సై మాధవరావు పశువుల యజమానులను మైకు ద్వారా హెచ్చరించారు. ఎవరైనా ఆవులను రోడ్లపై వదిలిపెడితే వారిపై కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. దీంతో ఆవులను తమ ఇళ్లకు తీసుకెళ్లారు. కొన్ని రోజుల తరువాత మరోసారి రోడ్లపైకి వదలడం మొదలు పెట్టారు. మరో వైపు వీధికుక్కలు కూడా ఇక్కడ స్వైర విహారం చేస్తున్నాయి. ఉదయంపూట వాకింగ్ వెళ్లే వారిపై, ద్విచక్ర వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు, పంచాయతీ అధికారులు సమస్య యంతో ఆవులు, కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అవీ.. ఇవీ..

ఉచిత కంటి వైద్యశిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంభం, జూన్ 16 : కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం విజయవాడకు చెందిన ఉన్నం చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లు ట్రస్టు నిర్వాహకులు శ్రీరామ్ తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్యశిబిరంలో 274 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 195 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు, వారిలో సోమవారం 100 మందిని పెద్దకాకాని శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. మిగిలిన 95 మందిని గురువారం ఆపరేషన్‌కు తీసుకెళతామన్నారు. వైద్యులు డాక్టర్ బిపిన్, డాక్టర్ ఎబోలి పాల్గొన్నారు.

తెలుగు, ఇంగ్లీష్ మీడియాలను సమాంతరంగా కొనసాగించాలి : ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుబాబు

గిద్దలూరు, జూన్ 16 : పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు మీడియాలు సమాంతరంగా కొనసాగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ సీనియారిటీ జాబితాలో పేర్లు నమోదు గురించి ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులరైజేషన్ గురించి డీఈవోను కలిసి వివరించారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన యూనియన్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ దస్తగిరిని సన్మానించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు సుబ్బరాయుడు, ఖాదర్‌బాషా, మూర్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోవధ చేస్తే కఠిన చర్యలు

గిద్దలూరు, జూన్ 16 : బక్రీద్ పర్వదినం సందర్భంగా గోవులను వధించరాదని, గో పరిరక్షణ చట్టాన్ని ధిక్కరించి గోవులను వధించి వాటి మాంసాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, చట్టాన్ని గౌరవించాలని తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

త్రిపురాంతకం, జూన్ 16: మండల కేంద్రంలోని ప్రధాన ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గత నెల 31న ఉద్యోగ విరమణ చేసిన ఆవుల వెంకటేశ్వర్లు దంపతులను ఎంఈవోలు, స్థానిక ఉపాధ్యాయులు, గ్రామస్థులు, కార్యాలయ సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా వెంకటేశ్వర్లు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవోలు మల్లిఖార్జుననాయక్, రాజశేఖరరెడ్డి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కందుల గౌతమ్


మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గౌతంనాగిరెడ్డి

మార్కాపురం, జూన్ 16: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డిని స్థానిక ఓబులరెడ్డి మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఎండీ డాక్టర్ కందుల గౌతమ్‌నాగిరెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కడప జిల్లా రాయచోటిలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అత్యంత వెనుకబడిన మార్కాపురం ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని గౌతమ్ నాగిరెడ్డి కోరారు. అంతేకాక అత్యంత పిన్నవయసే అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో నమ్మకంతో మంత్రి పదవి ఇచ్చారని, రాష్ట్ర ప్రజలకు అత్యున్నత సేవలు అందించి మంచి పేరు సంపాదించుకోవాలని సూచించారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర


విశేష అలంకరణలో అమ్మవారు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 16: మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కరాటేతో ఆత్మరక్షణ


కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 16: కరాటేతో ఆత్మరక్షణ పొందవచ్చని టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులు పాల్గొని బహుమతులు పొందారు. బహుమతుల ప్రదానంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు వివిధ రంగాలలో ప్రతిభ అవసరమన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్, చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్ట్రక్టర్ తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

కురిచేడు, జూన్ 16: మండలంలోని పడమర వీరాయపాలెంలో ఆదివారం ఎన్టీ రామారావు విగ్రహాన్ని గొట్టిపాటి లక్ష్మి ఆవిష్కరించారు. అదే గ్రామానికి చెందిన రావిపాటి శ్రీనివాసరావు గ్రామ కూడలిలో విగ్రహాన్ని ఏర్పాటుచేయగా, గొట్టిపాటి లక్ష్మి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ ఈరోజు రాష్ట్రంలో అధికారంలో ఉందన్నారు. అభాగ్యులకు అండగా నిస్తున్నదన్నారు. అన్న క్యాంటీన్లు రాష్ట్రంలో పేదవారికి ఆకలి తీర్చబోతున్నాయన్నారు. ఎన్టీఆర్ అంటే పేదలకు చేసే సేవే గుర్తుకు వస్తున్నదన్నారు. అటువంటి మహానాయకుని విగ్రహం ప్రారంభించే అదృష్టం రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కడియాల లలిత్ సాగర్, మొఘల్ మస్తాన్ వలి, కమతం నాగిరెడ్డి, గడ్డం బాలయ్య, కాశీ విశ్వనాథ రావు, తల్లం సుబ్రహ్మణ్యం, నెమిలయ్య, గంధం గురునాధం, మేడా నాగేశ్వరరావు, పావులూరి కోటిలింగయ్య, పువ్వాడ చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

దర్శి, జూన్ 16: మండలంలోని తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారు. ఈమేరకు ఎంపీడీవో ఎస్‌వీఎల్ హనుమంతరావుకు రాజీనామా పత్రాలను అందజేసినట్లు సమాచారం. మండలంలోని తుమ్మెదలపాడు, తూర్పువీరాయపాలెం, బొట్లపాలెం, రాజంపల్లి, సామంతపూడి, తానంచింతల, బండివెలిగండ్ల, చందలూరు, త్రిపురసుందరీపురం గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్వచ్ఛందంగా తప్పుకుంటున్నారు. మిగిలినవారు కూడా కొద్ది రోజుల్లో రాజీనామాలు చేసే అవకాశం ఉంది.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం

పామూరు, జూన్ 16: మండలంలోని నర్రమారెళ్ల గ్రామ పంచాయతీ సుబ్బక్కపల్లి గ్రామంలోని కోదండరామస్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా శాంతి కల్యాణం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, జి.శ్రీనివాసులు. జి.చినచెంచయ్య, పోకా వినోద్, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, మండంలోని చిలంకూరు గ్రామంలో సోమ, మంగళవారాలు సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు.


అన్న క్యాంటీన్‌కు విరాళం

కనిగిరి, జూన్ 16: ప్రముఖ వైద్యులు డాక్టర్ ధనుంజయుడు, అనూరాధలు అన్న క్యాంటీన్‌కు రూ.10 వేల విరాళాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి అందజేశారు. ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్ర విజయం సాధించటం పట్ల వారు అభినందనలు తెలిపారు. కమ్యూనిటీ వైద్యశాలలో పేద ప్రజలకు మెరుగైన వైద్యంతోపాటు నూతన ఆపరేషన్ వంటి సదుపాయాలపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర వారితో చర్చించారు. కనిగిరి అభివృద్ధిలో తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని వారు పేర్కొన్నారు.

గోవధ నిషేధం

ముండ్లమూరు, జూన్ 16: గోవులను తరలించటం, గోవధ చేయటం నిషేధమని ఎంవీఐ సురేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని శంకరాపురం వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు గోవుల అక్రమ తరలింపు, గోవధ చేయడం నిషేధమన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 చెక్ పోస్టులు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. గోవధకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంటకాగిన అధికారుల్లో దడ



- టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు యత్నాలు
- చేసిన తప్పులు కప్పిపుచ్చేందుకు మార్గాల అన్వేషణ
- అవినీతికి పాల్పడి లక్షలాది రూపాయలు స్వాహా చేసిన వైనం

దర్శి, జూన్ 16: గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ పాలనలో తప్పులు చేసిన అధికారులు తప్పించుకునేందుకు మార్గాలు అన్వేషించుకుంటున్నారు. ఎలాగయినా ఉపద్రవం నుంచి బయటపడేందుకు టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకునే యత్నాలు చేస్తున్నారు. మండల పరిషత్. పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖలలో పలువురు అధికారులు వైసీపీ నాయకులకు ఊడిగం చేశారు. కొన్ని శాఖల అధికారులు లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేశారు.

ముండ్లమూరు మండలానికి చెందిన ఒక పంచాయతీ కార్యదర్శి దర్శి మండలంలోని పలు గ్రామాల్లో ఇన్‌చార్జ్ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. అప్పటి వైసీపీ నాయకుల అండదండలతో తూర్పువీరాయపాలెం, సామంతపూడి, రాజంపల్లి, జముకులదిన్నె తదితర గ్రామాల్లో విధులు నిర్వహించే సమయంలో లక్షలాది రూపాయల పంచాయతీ నిధులను ఎలాంటి పనులు చేయకుండా అడ్డగోలుగా డ్రా చేశాడు. ఒక పంచాయతీలో రెగ్యులర్‌గా పనిచేస్తూ అదనంగా రెండు, మూడు పంచాయతీల్లో ఇన్‌చార్జ్‌గా ఆ కార్యదర్శే వ్యవహరించారు. పంచాయతీ నిధులను అప్పనంగా వైసీపీ నాయకులకు అప్పజెప్పటంతో ఆ అధికారి ఆడింది ఆటగా, పాటింది పాటగా చెలామణి అయ్యింది.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్న భయంలో ముండ్లమూరు మండలానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులను తీసుకుని దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్‌ను కలిసి నట్లు సమాచారం. అదేవిధంగా మండల పరిషత్‌లోని నిధులను కూడా నామమాత్రపు పనులు కూడా చేయకుండా లక్షలాది రూపాయలు డ్రా చేసుకున్నారు. ఆసమయంలో మండల పరిషత్ అధికారులు వైసీపీ నాయకులకు సహకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంవో ఎక్కడ విచారణ చేపడతారోనని ఆందోళన చెందుతున్న అధికారులు టీడీపీ నాయకులను కలిసే ప్రయత్నం చేస్తున్నారు.

అడ్డగోలుగా బిల్లులు చేసిన ఇంజనీరింగ్ అధికారులు

వైసీపీ పాలనలో అనేక పంచాయతీల్లో ఎలాంటి పనులు చేయకుండా నిధులు డ్రాచేసుకున్నప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు మట్టి రోడ్లు వేసినట్లు, చిల్లకంప తొలగించినట్లు బిల్లులు చేశా రు. కొన్ని నిధులను బ్లీచింగ్ చల్లినట్లు, పారిశుధ్య పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శులు లెక్కలు రాసుకున్నారు.

ఆ అధికారుల భరతం పట్టేందుకు రంగం సిద్ధం

అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారుల భరతం పట్టేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలిసింది. వైసీపీ పాలనలో జరిగిన నిధుల దుర్వినియోగాన్ని వెలికి తీసేందుకు టీడీపీ నాయకులు సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గ టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డ అధికారుల భరతం పట్టాలన్న ఉద్దేశంతో వారు కలిసేందుకు ప్రయత్నం చేసినప్పటికి అవకాశం ఇవ్వటం లేదు. ఒక అధికారి శాలువా కప్పే ప్రయత్నం చేయగా అందుకు టీడీపీ నాయకులు తిరస్కరించారు.

రెవెన్యూ శాఖలో కొందరు ఉద్యోగులు పైకి మంచిగా వ్యవహరిస్తూ అంతర్గతంగా వైసీపీకి మద్దతు ఇచ్చారు. ఒక వీఆర్‌వో పొతకమూరు పోలింగ్ బూత్ వద్ద వైసీపీకి ఓట్లు వేయాలని బాహాటంగా చెబుతున్న విషయాన్ని గమనించిన అక్కడి టీటీపీ నాయలకుల ఆగ్రహం వ్యక్తం చేయగా పక్కకు వెళ్లిపోయాడు. మరికొందరు అదేవిధంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పలువురు పోలీసు అధికారులు కూడా బాహాటంగా వైసీపీకి వత్తాసుగా నిలిచారు. టీడీపీ శ్రేణులను అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారు. దీంతో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారుల భరతం పట్టాలని, వైసీపీతో అంటగాగిన అధికారులకు గుణపాఠం చెప్పాలని టీడీపీ నాయకులు పట్టుదలతో ఉన్నారు. అందుకు అవసరమైన పూర్తి సమాచారం సేకరిస్తున్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, జూన్ 16: జిల్లాలో అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న తూర్పుగంగవరం పంచాయతీ సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గుంటి గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధి క సంఖ్యలో భక్తులు పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో కూటమి శ్రేణు లు గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడంతో భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్ర నామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్‌రావులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

పొంగళ్లు పెట్టిన కొత్తపాలెం టీడీపీ శ్రేణులు

తాళ్లూరు, జూన్ 16: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావటంతో మండలంలోని కొత్తపాలెం గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం గంగమ్మ తల్లికి పొంగళ్లు నైవేద్యంగా పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని టీడీపీ శ్రేణులు ట్రాక్టర్లు, ప్రత్యేక వాహనాల్లో భారీ ర్యాలీగా గుంటిగంగకు చేరుకున్నారు. పొంగళ్లు పెట్టి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. అమ్మ వారి దర్శనానికి వచ్చిన భక్తులకు పొంగలి ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం గ్రామంలో పాటకచేరీ నిర్వహించారు.



పొంగళ్లతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



మాట్లాడుతున్న పువ్వాడి వెంకటేశ్వర్లు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

పామూరు, జూన్ 16: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని కంభాలదిన్నెలో టీడీపీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్ర విజయానికి కృషిచేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత అభివృద్ధిని విస్మరించిందని ధ్వజమెత్తారు. కక్షలు, అక్రమ కేసులతో ఐదేళ్లు ప్రజలకు నరకం చూపారన్నారు. ఎన్నికల్లో అన్నివర్గాలు ఏకతాటిపై నిలిచి ఉగ్ర గెలుపులో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దశరథ రామయ్య, బొల్లా నరసింహారావు, మన్నం రమణయ్య, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ గరికపాటి వెంకట్



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న గరికపాటి వెంకట్

ముండ్లమూరు, జూన్ 16: క్రీడాకారులు గెలుపు, ఓటములను హుందాగా స్వీకరించాలని, ఓడిన వారు మరోసారి విజయంపై దృష్టి పెట్టాలని జనసేన పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గరికపాటి వెంకట్ అన్నారు. మండలంలోని వేంపాడులో గత పది రోజుల నుంచి జిల్లాస్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొత్తం 80 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి బహుమతి వేంపాడు ఎస్ఆర్ టీమ్, ద్వితీయ బహుమతి తాళ్ళూరి మండలం రమణాలవారిపాలెం, తృతీయ బహుమతి వేంపాడు జూనియర్ టీమ్ సాధించాయి. విజేతలకు వెంకట్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రికెట్ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆటల పోటీలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయన్నారు. మొదటి బహుమతికి ఎన్ఆర్ఐ అజయ్ రూ.25,116 అందజేయగా ద్వితీయ బహుమతి టీడీపీ యువ నాయకులు బేతపూడి రామారావు రూ.15,116, తృతీయ బహుమతి మాజీ సైనిక ఉద్యోగి రాగిపిండి నాగేశ్వరరెడ్డి రూ.10,116 అందజేశారు. కార్యక్రమంలో గంగినేని శేషగిరిరావు, మేదరమెట్ల సుబ్బారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

కనిగిరి, జూన్ 16: ప్రైవేటు టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి పీటీఎల్‌యూ జిల్లా అధ్యక్షుడు రషీద్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీటీఎల్‌యూ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై సీఎం సంతకం చేయటం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. మెగా డీఎస్సీలో వయోపరిమితిని సడలించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో విజయకుమార్, అశ్వని, బాలనారాయణ, వెంకటేశ్వర్లు, భవాని, స్వర్ణ, విజయ, దుర్గ, నాగరాజు, రమేష్, మహేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం



మేనేజర్ సంజీవ్‌రావును సత్కరిస్తున్న ఖాతాదారులు

తాళ్లూరు, జూన్ 16: బదిలీపై వెళుతున్న మండలంలోని బొద్దికూరపాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వేముల సంజీవ్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ వేల్పుల సాయిలక్ష్మిలను ఖాతాదారులు ఆదివారం ఘనంగా సత్కరించారు. మేనేజర్ సంజీవ్‌రావు ఒంగోలు బ్రాంచ్‌కి, అసిస్టెంట్ మేనేజర్ సాయిలక్ష్మి కడప బ్రాంచికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఖాతాదారులు మాట్లాడుతూ ఖాతాదాల అభ్యున్నతికి, బ్యాంక్ బలోపేతానికి వారు కృషి చేశారన్నారు. ముందుగా ఇరువురిని దుశ్శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఖాతాదారులు చల్లపల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని గాడిలో పెట్టాలి

- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి

కనిగిరి, జూన్ 16: అస్తవ్యస్తంగా మారిన విద్యారంగాన్ని నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం గాడిలో పెట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఐదేళ్ళు అత్యుత్తమ పాలన అందించే దిశగా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో తెలుగుమీడియంను కొనసాగించాలని, ప్రతి హైస్కూల్‌కి హెచ్‌ఎం పోస్ట్ తప్పనిసరిగా ఉంచాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, జోనల్ నాయకులు హజరత్, బీవీఎస్ ప్రసాద్, ఎన్. రమేష్‌బాబు, తోట శ్రీనివాసులు, ఏఎస్.ఆనంద్, కె.రామ్మోహన్, డి.సుబ్బరాయుడు, పొటేళ్ళ మాలకొండయ్య, జి.రామకృష్ణ, ఇండ్ల ప్రసాద్, ఎం.రాములు, కేవీ సుబ్బయ్య, దండే శ్రీనివాసులు, కేవీ భాస్కర్‌రెడ్డి, ఒంగోలు వెంకటేశ్వర్లు, నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

కనిగిరి, జూన్ 16: ప్రభుత్వ ఉద్యోగుల కనిగిరి తాలూకా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నికున్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు మసూద్‌ఆలీ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. తాలూకా అధ్యక్షుడిగా రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ గా గాజులపల్లి రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా సుబ్రమణ్యం, ట్రెజరర్‌గా శ్రీనివాసులతో పాటు కార్యవర్గసభ్యుల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని కమిటీ మర్యాదపూర్వకంగా కలవగా వారిని అభినందించారు. నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా యూనిట్ సభ్యులు అక్బర్‌బాషా, పాండురంగారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మస్తాన్‌వలి, కొండయ్య మున్నీషా బేగం, నిర్మల, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

పామూరు, జూన్ 16: త్యాగానికి ప్రతీక బక్రీద్. ఈ పం డుగను ఈదుల్ అజ్హా లేదా ఖుర్బాని అని కూడా పిలుస్తారు. సోమవారం బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపు కొనేందుకు ముస్లింలు సంసిద్ధులవుతున్నారు. సాముహిక ప్రార్థనల కోసం స్థానిక సీఎస్‌పురం రోడ్డులోగల ఈద్గా మైదా నాన్ని సిద్ధం చేశారు. ఈసందర్భంగా పట్టణంలోని ఏడు మసీదులతోపాటు మండలంలోని మోపాడు, లక్ష్మీనరసాపురం, కందువారిపల్లి, వగ్గంపల్లి గ్రామాల్లోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి


దొనకొండ, జూన్ 16: త్యాగానికి, సత్యానికి ప్రతీతగా నిల్చే బక్రీద్ పర్వదిన వేడుకలను మండలంలోని ముస్లిం సోదరులు సుఖశాంతులతో జరుపుకోవాలని ఎస్సై సంపత్‌కుమార్ సూచించారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు మండలంలోని ముస్లిం మతపెద్దలతో ఆదివారం స్థానిక పో లీస్‌స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా అయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ప్రార్థనలు, ఇతర కార్యక్రమాల సమయంలో ఎలాంటి సంఘటనలు, సమస్యలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

దర్శి, జూన్ 16: బక్రీద్ పండుగను ఆనందోత్సాహాలతో జ రుపుకోవాలని నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఆమె ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా ఈ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారన్నారు. ముస్లింల అభ్యున్నతికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని డాక్టర్ లక్ష్మి తెలిపారు.




పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌లో పెరిగిన కంప చెట్లు



అమరావతి రైలుపై.. ఆశలు

- పట్టాలపైకి రాజధాని రైలు మార్గం
- నాడు ఎన్‌డీఏ-1 ప్రభుత్వంలోనే మంజూరు
- ప్రాజెక్టు జోలికి వెళ్లకుండా వైసీపీ కాలయాపన
- కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో ప్రాజెక్టుకు సుగమం

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని రైలు మార్గం.. పదేళ్లుగా ఊరిస్తోన్న అంశం. గత టీడీపీ ప్రభుత్వంలో సర్వే పూర్తి చేసుకుని, డీపీఆర్ సిద్ధమైన ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కింది. మరికొద్ది రోజుల్లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఎన్‌డీఏ-3 ప్రభుత్వం అమరావతి రైలు మార్గానికి ప్రత్యేకంగా కొంత నిధులను కేటాయించే అవకాశం ఉందని సమాచారం. దీంతో అమరావతి రైలుమార్గం ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తోన్నాయి. రైలు మార్గానికి అవసరమయ్యే భూమిని సేకరించి ఇవ్వడంతో పాటు 50 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. అయితే నిధుల కొరతతో రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో కేంద్రమే ఈ బృహత్తర ప్రాజెక్టుని చేపట్టాలని టీడీపీ ప్రభుత్వం కోరగా రైల్వే శాఖ సొంత నిధులతోనే పూర్తి చేయాలని భావించింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ రాజధాని అంశాలతో పాటు ఈ నూతన రైలు మార్గం ప్రాజెక్టును పక్కన పడేసింది. టీడీపీ ఆధారిత ఎన్‌డీఏ-3 ప్రభుత్వం కేంద్రంలో పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో రాబోయే బడ్జెట్‌లో కచ్చితంగా అమరావతి రైలుమార్గానికి మంచి జరుగుతుందని అంతా భావిస్తున్నారు.



అమరావతి రాజధాని నూతన రైలు మార్గం ఎలైన్‌మెంట్

సర్వే పూర్తి.. డీపీఆర్ సిద్ధం

ప్రపంచంలోనే ఉత్తమమైన రాజధాని నగరంగా అమరావతిని నిర్మించేందుకు పదేళ్ల క్రితమే అప్పటి టీడీపీ ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌ని రూపొందించింది. అందులో అమరావతికి రైలుమార్గాన్ని కూడా పొందుపరిచింది. ఆర్‌వీఎన్ఎల్ సంస్థ సర్వే కూడా నిర్వహించింది. తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో ఎర్రుబాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు తొలి దశలో సింగిల్ లేన్ రైలుమార్గానికి డీపీఆర్ కూడా రూపుదిద్దుకొన్నది. ఇది ఒక విధంగా విజయవాడకు బైపాస్ రైలుమార్గంగా కూడా ఉపయోగపడుతుందని అప్పట్లో భావించారు. అలానే నరసరావుపేట నుంచి సత్తెనపల్లి, పెదకూరపాడు నుంచి అమరావతికి కూడా రెండు సింగిల్ లేన్‌మార్గాలను ఇందులో చేర్చారు. ఇందుకోసం మొత్తంగా రూ.2,800 కోట్లకు పైగా నిధులు ఖర్చు అవుతాయని అంచనా వేశారు.

ఈ ప్రాజెక్టులో కృష్ణానదిపై 3 కిలోమీటర్ల రైలు వంతెన నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కూడా ఈ ప్రాజెక్టుని చేర్చింది. అయితే నిధుల కేటాయింపు మాత్రం జరపకుండా జాప్యం చేసింది. సరిగ్గా అదే తరుణంలో ఎన్‌డీఏ-1లో బీజేపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నదని ఆ కూటమి నుంచి టీడీపీ బయటకు వచ్చేసింది. దాంతో ఒక విధంగా ఈ ప్రాజెక్టుని రైల్వే శాఖ అటకెక్కించింది. మరోవైపు 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధానిపై ఉన్న అక్కసుతో విధ్వంసానికి పాల్పడింది. అమరావతి కోసం ఒక్క రూపాయిని కూడా కేంద్రం నుంచి అడగలేదు. నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులను ఎక్కడి కక్కడ నిలిపేసి మూడు ముక్కలాటకు తెరలేపి కాలయపన చేసింది. దీంతో అమరావతి రైలుమార్గం మరిచిపోవాల్సిందేనని భావిస్తున్న తరుణంలో మళ్లీ బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కూటమి కట్టి ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందుకున్నాయి. పైగా కేంద్రంలో టీడీపీకి చెందిన 16 ఎంపీలపై ఎన్‌డీఏ-3 ప్రభుత్వం ఆధారపడి ఉన్నది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు కూటమిలో కీలకభూమిక పోషిస్తారని ఇప్పటికే తేలింది. ఈ దృష్ట్యా రాబోయే బడ్జెట్‌లో కచ్చితంగా అమరావతి నూతన రైలుమార్గం నిర్మాణంలో అడుగులు పడేలా నిధుల కేటాయింపు జరిపిస్తారని అంతా భావిస్తున్నారు.

పాడుబెట్టారు.. పట్టించుకోండి

- అధ్వానంగా మారిన సాగర్ కాల్వలు
- కనీస మరమ్మతులపైనా ఐదేళ్లుగా వైసీపీ నిర్లక్ష్యం
- కాడా నిధులను దారి మళ్లించిన జగన్ ప్రభుత్వం
- రూపురేఖలు కోల్పోయి నీటి పారుదలకు అవరోధాలు
- కాల్వల బాగుపై ప్రభుత్వం దృష్టి సారించాలంటున్న రైతులు

కొత్త ప్రాజెక్టులు కాదు కదా.. సాగునీటి కాల్వలకు కనీస మరమ్మతులు చేయాలన్న స్పృహ లేకుండా వైసీపీ ఐదేళ్ల పాలన సాగింది. రూపురేఖలు కోల్పోయి సాగు, తాగునీటి పారుదలకు అవరోధాలతో రైతులు అష్టకష్టాలు పడుతున్నా వాటి బాగుపై నాటి ముఖ్యమంత్రి జగన్ దృష్టి సారించలేదు. వైసీపీ పాలనలో పాడుపెట్టిన కాల్వలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవాలని రైతులు ఆశిస్తున్నారు. నిధులు కేటాయించకుండా నిర్వహణను గాలికొదిలేసిన కాల్వలను బాగు చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలతో నిండి.. డ్రాపులు పగిలిపోయి.. షట్టర్లు దెబ్బతిని.. తూములకు కనీసం షట్టర్లు కూడా లేని నాగార్జున సాగర్ కాల్వలను బాగు చేసి సాగు నీటి పారుదల వ్యవస్థను చక్కదిద్ది ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉన్న కాల్వలను ఈ ఏడాదైనా బాగు చేయక పోతే సాగునీటి పారుదలకు ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధుల విడుదలకు కూటమి ప్రభుత్వంపై అన్నదాతలు కోటి ఆశలు పెట్టుకున్నారు. కనీసం అత్యవసర పనులైనా చేపట్టాలని కోరుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంది. వేలాది మంది రైతులు జీవనం సాగిస్తున్నారు. అయినా సాగర్ పరిధిలోని కాల్వల్లో సాగునీరు పారే పరిస్థితి లేదు. మేజర్లు, మైనర్, సబ్‌మైనర్ కాల్వలు శిథిలస్థితికి చేరుకున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో కాల్వలు రూపురేఖలు కోల్పోయి నీటి పారుదలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఇంత అధ్వానంగా ఉన్న కాల్వల బాగుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించలేదు. నిధులు విడుదల చేయకుండా కాల్వలను పాడుబెట్టింది. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగా కాల్వల మరమ్మతులపై జలవనరుల శాఖ ప్రతిపాదనలు కూడా రూపొందించలేదు. కాల్వల్లో కంప చెట్లు పెద్దఎత్తున పెరిగాయి. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు కాల్వల నిండా అల్లుకుపోయాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూడా దెబ్బతిన్నాయి. మైనర్లకు నీటిని సరఫరా చేసే తూములకు కనీసం షట్టర్లు కూడా లేవు. నీటి సరఫరాలో నియంత్రణ లేకుండా పోయింది. దీంతో నీటి సరఫరాకు అవరోధంగా మారుతుంది. నాచు పెరిగిన వెంటనే తొలగించక పోవడంతో దిగువకు నీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడంలేదు. ఈ పరిస్థితుల్లో కనీస మరమ్మతులు తప్పనిసరి అయినా ప్రతీ ఏటా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. నిధులు విడుదలపై ప్రభుత్వం స్పందించలేదు. సాగు నీటి సంఘాలకు ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో కాల్వల బాగు గురించి పట్టించుకునే వారే లేకుండా పోయారు. నీటి సంఘాల బాధ్యతలను అధికారులకు ప్రభుత్వం అప్పగించగా వారు నిధుల కేటాయించక పోవడంతో వారు కూడా పట్టించుకోలేదు.



రూపురేఖలు కోల్పోయిన గోవిందాపురం మేజర్



తుర్లపాడు మేజర్‌లో పూడిపోయిన తూము



జమ్ముతో నిండిన మైనర్ కాలువ



కాలువలో పెరిగిన కంప

నీటి తీరువా వసూలైనా.. నిధుల కొరతే

రైతులు ఏటా నీటి తీరువా చెల్లిస్తారు. నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయంలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. నీటి తీరువా నిధులను కాడా కమిటీల వారీగా కేటాయించాలి. ఈ నిధుల్లో సగం మేజర్, సగం మైనర్ ఇరిగేషన్లకు కేటాయించాలి. 10 శాతం పరిపాలనకు, 15 శాతం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం నిధులను ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇలా కేటాయింపులు ఐదేళ్లుగా జరగలేదు. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా రూ.20 నుంచి 21 కోట్లు వస్తుందని అంచనా. ఈ నిధులు కాడాకు చేరకుండా నేరుగా ప్రభుత్వ ఖజానాకు జమ చేసుకోవడంతో కాల్వల నిర్వహణకు నిధుల కొరత ఏర్పడింది. కాల్వల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. నీటి తీరువా నిధులను ఏటా కాల్వల మరమ్మతులకు కేటాయించి ఉంటే కాల్వలు ఇంత అధ్వానంగా ఉండేవి కాదని రైతులు చెబుతున్నారు. రైతులు చెల్లించిన నీటి తీరువా శిస్తు నిధులను కాల్వల నిర్వహణకు ఖర్చు చేయకపోవడంతో అధ్వానంగా మారాయి. పూర్తిగా అధ్వానంగా ఉన్న కాల్వల మరమ్మతులను కూటమి ప్రభుత్వం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ కు కనీసం అత్యవసర పనులైనా నిర్వహించాలని పాలకులకు అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు ఎస్పీ వకుల్ జిందాల్ సూచన



బాపట్ల, జూన్ 16: తక్కువ సమయంలో సులువుగా ఎక్కువడబ్బులు సంపాదించాలనే ఆశను అస్త్రంగా ఎంచుకుంటున్న సైబర్ నేరగాళ్ల మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలపై కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగాలు పార్ట్‌టైమ్ జాబ్ కోసం ఆన్‌లైన్‌లో అన్వేషిస్తూ మోసాల బారిన పడుతున్నారన్నారు. ఆన్‌లైన్‌లో జాబ్ కోసం సెర్చింగ్ చేసే వారి వివరాలను సేకరించి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వాట్సాప్ నెంబర్లకు పార్ట్‌టైమ్ జాబ్ అని మెసేజ్ పంపి దానికి జవాబు ఇవ్వగానే లింకు పంపించి దానిని క్లిక్ చేయగానే టెలిగ్రామ్ గ్రూప్‌లో జాయిన్ చేస్తారన్నారు. ఆ గ్రూప్‌లో వివిధరకాల తేలికైన టాస్క్‌లు ఇచ్చి అవి పూర్తయిన తర్వాత చిన్న మొత్తంలో సొమ్ము గెలిచినట్లు ఖాతాలో డబ్బులు జమచేసి ఆ తర్వాత పెద్ద మొత్తంలో నగదు కాజేస్తారన్నారు. ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు పెరిగిపోతుండగా అదేస్థాయిలో ఆన్‌లైన్‌లో మోసాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ఎటువంటి పెట్టుబడి లేకుండా డబ్బులు వస్తాయని, తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని ఆశ చూపించి ఖాతాల్లోని నగదును మాయం చేసే మోసాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రజల ఆశే అవకాశంగా ఇలాంటి మోసగాళ్లు సొమ్ము స్వాహా చేస్తారన్నారు. ఇలా వివిధరకాల మోసాలు జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ముస్లింలకు శుభాకాంక్షలు

ముస్లింలకు ఎస్పీ వకుల్ జిందాల్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సర్వమత సమ్మేళనమైన దేశంలో ఒకరిమనోభావాలను మరొకరు గౌరవించుకోవాలన్నారు. అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పిన్నెల్లి సోదరులు.. రౌడీలు



- ఎట్టకేలకు ప్రకటించిన పోలీసుశాఖ
- మాచర్ల పోలీసుస్టేషన్‌లో బ్రదర్స్‌పై రౌడీషీట్లు
- మాజీ ఎమ్మెల్యేపై 14.. వెంకట్రామిరెడ్డిపై 9 కేసులు
- బెయిల్‌పై ఎస్పీ కార్యాలయంలో అన్న సంతకం.. పరారీలో తమ్ముడు

నరసరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి సోదరుల్లో అన్న ఎమ్మెల్యే. తమ్ముడు వైసీపీ నేత. అధికారం అండతో మాచర్ల నియోజకవర్గంలో చెలరేగిపోయారు. రెండు దశాబ్దాలు ఎమ్మెల్యేగా చెలాయించిన వారు ఈసారి కూడా గెలిచి ఎవరూ అడ్డంరాకుండా.. ఎదురేలేదని నిరూపించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో అరాచకాలతో హింసకు దిగారు. చెప్పిందే చట్టం.. మాటే శాసనంగా అధికారం చెలాయించిన పిన్నెల్లి సోదరులు రౌడీలుగా పోలీసులు తేల్చారు. అధికారం అండతో ప్రభుత్వ వ్యవస్థలను చెప్పు చేతల్లో ఉంచుకుని అరాచకాలు సాగించగా.. వారికి కొమ్ము కాసిన పోలీసులే వారిపై రౌడీషీట్లు పెట్టారు. వీధి రౌడీల్లా ప్రవర్తించిన మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలపై మాచర్ల పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్లు తెరిచారు. మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్, ఆ తర్వాత సాగించిన హింసా కాండకు సంబంధించి రామకృష్ణారెడ్డిపై 14, వెంకట్రామిరెడ్డిపై 9 కేసులు నమోదయ్యాయి. రామకృష్ణారెడ్డిపై నమోదైన 14 కేసుల్లో 307 సెక్షన్ కింద మూడు, వెంకట్రామిరెడ్డిపై ఉన్న 9 కేసుల్లో 307 సెక్షన్ కింద నాలుగు కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో రౌడీలుగా గుర్తింపు పొందినవారిలో ఒకరైన రామకృష్ణారెడ్డి బెయిల్‌పై నరసరావుపేటలో ఉంటూ రోజూ ఎస్పీ కార్యాలయంలో సంతకం చేస్తున్నాడు. ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి గత నెల 14 నుంచి పరారీలో ఉన్నాడు.

నాడు భయపెట్టారు.. నేడు భయపడ్డారు

మాచర్ల మారీచులుగా ముద్రపడిన పిన్నెల్లి సోదరులు తమకు అడ్డేలేదని చెలరేగిపోయారు. అక్రమ కేసులతో ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టారు. తమ అరాచకాలకు అడ్డుగా ఉన్న వారిని, ప్రశ్నించే వారిని భయపెట్టి గ్రామాల నుంచి వలసలు వెళ్లేలా చేశారు. దాడులు చేసినా కేసులు నమోదు కాకుండా పోలీసు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారు. అదే పోలీసులకు భయపడి తలదాచుకోవాల్సిన పరిస్థితులను ప్రస్తుతం వారు ఎదుర్కొంటున్నారు. మొత్తం మీద పోలింగ్ హింసాత్మక ఘటనలు పిన్నెల్లి బ్రదర్స్‌కు భయాన్ని పరిచయం చేశాయి. భయపెట్టి ప్రత్యర్థులు గ్రామాల నుంచి వలసలు వెళ్లేలా చేసిన సోదరులు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లారు. రామకృష్ణరెడ్డి బెయిల్‌పై ఉండగా వెంకట్రామిరెడ్డి ఇంకా పరారీలోనే ఉన్నాడు. హత్యాయత్నం కేసులు నమోదుతో పరారీలో ఉన్న వెంకట్రామిరెడ్డిని అరెస్టు చేయకుండా ఇంకా కొందరు పోలీసులు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. పోలీసులు తలుచుకుంటే వెంకట్రామిరెడ్డిని పట్టుకోవడం పెద్ద పని కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

హత్యాయత్నం కేసులు

- పాల్వాయిగేటు బూత్ వద్ద నంబూరి శేషగిరిరావు, ఓ మహిళపై దాడికి సంబంధించి రామకృష్ణారెడ్డిపై 307 సెక్షన్ కింద రెండు హత్యాయత్నం కేసులు.
- కారంపూడిలో జరిగిన విధ్వంసకాండ, సీఐ సహా పలువురిపై దాడి చేసిన కేసులో సోదరులపై 307 సెక్షన్
- మాచర్లలోని పీడబ్ల్యూడీ కాలనీలో టీడీపీ కార్యకర్తలను వాహనంతో తొక్కించిన వెంకట్రామిరెడ్డిపై మూడు హత్యాయత్నం కేసులు
- వెల్దుర్తి మండలం కండ్లకుంటలో చోటు చేసుకున్న ఘటనలకు సంబంధించి పిన్నెల్లి బ్రదర్స్‌పై కేసులు.
- వెల్దుర్తి మండలం కేపీగూడెంలో టీడీపీ ఏజెంట్ రేఖ్యానాయక్‌పై దాడి సంఘటనలో 307 కేసు.

ఈసీ ఆదేశాలతోనే కేసులు..

ఎన్నో ఏళ్లుగా ఎదురు లేకుండా అధికారం చెలాయించిన పిన్నెల్లి సోదరులపై ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేసే సాహసం ఏ స్థాయి పోలీసులూ చేయలేదు. పాల్వాయిగేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎంను ఎమ్మెల్యేగా ఉన్న రామకృష్ణారెడ్డి స్వయంగా ధ్వంసం చేయడం ఆ వీడియో ఆలస్యంగా వెలుగు చూడటమే పిన్నెల్లి సోదరుల పాలిట శాపంగా మారింది. అప్పటి వరకు ఈవీఎం ధ్వంసం ఘటనపై గుర్తు తెలియని వ్యక్తులు అని ఎన్నికల అధికారులు ఫిర్యాదు చేయగా పోలీసులు అలాగే కేసు నమోదు చేశారు. ఎన్నికల సంఘం దీనిపై విచారణకు ఆదేశించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింస, పిన్నెల్లి సోదరుల పాత్రపై వరుసగా కేసులు నమోదయ్యాయి.



కార్డుదారులకు కందిపప్పు, చక్కెర

» వచ్చేనెల నుంచి పంపిణీ

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 16 : రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పును ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాదిగా కందిపప్పు పంపిణీని నిలిపివేసింది. దీంతో పేదలు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో ఈనెల 12వతేదీన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా కందిపప్పు ఇవ్వడం లేదన్న విషయం ఆయన దృష్టికి వెళ్లింది. సీఎం ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ అధికారులు కదిలారు. రాష్ట్రస్థాయిలో కందిపప్పును కొనుగోలు చేసి ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపారు.

ఈనెల 20వతేదీ నుంచి రేషన్ షాపులకు బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లు, పంచదారను సరఫరా చేయాల్సి ఉంది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లో దించిన చెక్కర, కందిపప్పు నాణ్యతతోపాటు అక్కడికి వచ్చిన ప్యాకెట్లను తూకం వేసి పరిశీలించారు. వచ్చేనెల 1 నుంచి వీటిని పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎం.వి.సత్యనారాయణ, గంగాధర్, గోడౌన్ ఇన్‌చార్జి నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్లు ఆర్వీఎస్ కృష్ణమోహన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఊతకోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండిన ఎండ

» ఒంగోలులో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 16 : జిల్లాలో మరోసారి ఎండ మండింది. పక్షం రోజుల క్రితం వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే నాలుగైదు రోజుల నుంచి క్రమంగా ఎండల తీవ్రత మళ్లీ పెరిగింది. జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఆదివారం 40.1 డిగ్రీలకు గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు తల్లడిల్లిపోయారు. ఉదయం 8గంటల నుంచే ఎండ తీవ్రతతోపాటు ఉక్కపోత అధికంగా ఉండటంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో నగరంలోని ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం ఆరు గంటల తర్వాత ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. నగరానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో జల్లులు పడటంతో ప్రజలకు ఉపశమనం లభించింది.

ఎమ్మెల్యేల చేతుల మీదుగా స్టూడెంట్ కిట్లు

ఒంగోలు (విద్య), జూన్ 16: ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న స్టూడెంట్ కిట్స్‌ను స్థానిక శాసనసభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. ఈమేరకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశించారు. ఈనెల 20 నుంచి 22వతేదీలోపు పూర్తిస్థాయిలో బ్యాగులు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, షూలు, బెల్టులు పాఠశాలలకు అందనున్నాయి. ఆతర్వాత ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఈ కిట్‌లను పంపిణీ చేయించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాత లోగో ఉన్న పుస్తకాలు కానీ, బ్యాగులు కానీ అనుమతించరాదని పీడీ సూచించారు.

ఎంపీని సన్మానించిన చినగంజాం టీడీపీ శ్రేణులు



ఎంపీ కృష్ణప్రసాద్‌ని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, జూన్ 16 : పలు సమస్యలను టీడీపీ మండల నాయకులు బాపట్ల పార్లమెంట్ సభ్యుడు టీ కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయనను టీడీపీ మండల నేతలు మర్యాదపూర్వకంగా కలిసారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య ఆధ్వర్యంలో నాయకులు ఎంపీ కృష్ణప్రసాద్‌ని సన్మానించారు. చినగంజాం రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ సదుపాయం కల్పించాలని, సోపిరాల రామకోటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని రైల్వేగేటు దగ్గర అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని, 12604 నెంబరు గల హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్, 12603 నెంబరు గల చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు, 12734 నెంబరు లింగంపల్లి నుంచి తిరుపతి వెళ్ల రైలు, 12733 నెంబరు తిరుపతి నుంచి లింగంపల్లి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు చినగంజాం స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని నాయకులు ఎంపీకి విన్నవించారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చినగంజాం, మోటుపల్లి గ్రామ సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, వడ్లమూడి సాంబశివరావు, చినగంజాం గ్రామ టీడీపీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య, టీడీపీ బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు, పర్వతరెడ్డి పార్థసారిధి పాల్గొన్నారు.

ప్రభుత్వ దృష్టికి ఉద్యోగుల సమస్యలు

పర్చూరు, జూన్ 16: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సామరస్యంగా పరిష్కరించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కృషి చేస్తుందని సంఘ బాపట్ల జిల్లా అధ్యక్షుడు కె.రోశయ్య అన్నారు. ఆదివారం ప్రభుత్వ వైద్యశాల భవనంలో ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆదేశాల మేరకు, బాపట్ల జిల్లా ఇన్‌చార్జి నాగసాయి ఆదేశాల మేరకు ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

24 నుంచి డీఈఎల్ఈడీ పరీక్షలు

ఒంగోలు(విద్య), జూన్ 16: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషనల్ (డీఈఎల్ఈడీ) 2022-24 బ్యాచ్ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24నుంచి 27వ తేదీ వరకు మైనంపాడులోని జిల్లా విద్యా శిక్షణా సంస్థలో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసు కోవాలని ఆయన కోరారు.

పాఠశాల గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలి

ఒంగోలు(విద్య), జూన్ 16 : పాఠశాల నిర్వహణ గ్రాంటు, స్కూలు కాంప్లెక్స్ గ్రాంటులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో వెంటనే విడుదల చేయాలని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు టీఎల్.కాంతారావు కోరారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉన్నత పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని, హైస్కూలు ప్లస్ పాఠశాలలో నిర్వహణకు ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలని, పాఠశాలల్లో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని కోరారు. నాడు-నేడు పనుల నిర్వహణ నుంచి ప్రధానోపాధ్యాయులను మినహాయించాలన్నారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌కు, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామిలకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి వై.వెంకట్రావు, కోశాధికారి జీఎస్ఆర్ సాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీవీ.సుబ్రహ్మణ్యం, ఆడిట్ కమిటీ సభ్యులు సీహెచ్.కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

ఒంగోలు(విద్య), జూన్ 16 : జాతీయ ఉపకార వేతన పరీక్ష నేషనల్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి అని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుబద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ సీడింగ్ అయిన బ్యాంకు ఖాతాలకు మాత్రమే ఉపకార వేతనం నగదు జమ అవుతుంది. 2019, 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఈ ఉపకార వేతనానికి ఎంపికై ప్రస్తుతం 9నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు తమ బ్యాంకుఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలన్నారు. స్కాలర్‌షిప్ పోర్టర్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్నా, రెన్యువల్ చేసినా బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోతే నగదు జమ కాదన్నారు. ప్రస్తుతం ఉపకార వేతనం నగదు జమకాని విద్యార్థుల పేర్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. తమ బ్యాంకు ఖాతాలకు నగదు జమకాని విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ వివరాలు చూసుకొని తమ బ్యాంకు జాబితాలకు ఆధార్ సీడింగ్ చేయించి డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ జరిగేలా ఏర్పాటు చేసుకోవాలని డీఈవో కోరారు.

అఖండ స్వాగతం

» మంత్రిగా డాక్టర్ స్వామి జిల్లాకు తొలిసారి రాక

» బొప్పూడి నుంచి నాయుడుపాలెం వరకు కోలాహలంగా ర్యాలీ

» హాజరైన ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు



డాక్టర్ స్వామిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

ఒంగోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి జిల్లాకు ఆదివారం వచ్చిన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి టీడీపీ శ్రేణులు, అభిమానులు అఖండ స్వాగతం పలికారు. ఉమ్మడి జిల్లా సరిహద్దు బొప్పూడి నుంచి స్వామి స్వగ్రామమైన నాయుడుపాలెం వరకు వందలాది వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. సుమారు ఐదు గంటల పాటు ఈ ర్యాలీ జరిగింది. పలుచోట్ల గజమాలలు, బాణాసంచా మోతలు, ఇతర రూపాల్లో సంబరాలతో కోలహలంగా సాగింది. కొండపి నుంచి వరుసగా మూడోసారి విజయం సాధించిన డాక్టర్ స్వామికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని మంత్రివర్గంలో స్థానం కల్పించారు. అనంతరం ఆయనకు కీలకమైన సాంఘిక సంక్షేమశాఖను కేటాయించారు. ఈనెల 12న కేసరపల్లి వద్ద సభలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ స్వామి అప్పటి నుంచి విజయవాడలోనే ఉన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లాకు వచ్చారు. మధ్యాహ్నం తర్వాత కొండపి నియోజకవర్గంలో తనకు పార్టీ పరంగా, ఆర్థికపరంగా అన్నీ చూస్తున్న టీడీపీ యువనేత దామచర్ల సత్యతో కలిసి విజయవాడ నుంచి బయల్దేరిన స్వామి మూడు గంటలకు ఉమ్మడి జిల్లా సరిహద్దు బొప్పూడి వద్దకు చేరుకున్నారు.

కొండపి నియోజకవర్గంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు, అభిమానులు వారికి అఖండ స్వాగతం పలికారు. మంత్రి స్వామి, సత్యలతోపాటు టీడీపీ సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు దంపతులు అక్కడి ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బయల్దేరి జిల్లా సరిహద్దు అయిన గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్దకు సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో చేరుకున్న స్వామికి సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆ నియోజకవర్గానికి చెందిన మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు నేతృత్వంలో పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలు తరలివచ్చి గజమాలతో సత్కరించారు.

అనంతరం ఆరు గంటలకు ఒంగోలు నగరంలోకి మంత్రి స్వామి, సత్యలు ఓపెన్ టాప్ జీపులో చేరుకోగా పెద్దఎత్తున యువకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పాత బైపాస్ రోడ్డు మార్గాన కాన్వాయ్ రాగా మంగమ్మకాలేజీ జంక్షన్, మంగమూరు రోడ్డు జంక్షన్, క్విస్ కాలేజీ జంక్షన్, సౌత్ బైపాస్ జంక్షన్ల వద్ద వందలాది మంది టీడీపీ శ్రేణులు అభిమానులు, వచ్చి గజమాలలతో సత్కరించారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి కోలాహలంగా ర్యాలీ నిర్వహించారు. అక్కడి ఉంచి వల్లూరు చేరుకొని వల్లూరమ్మ దేవాలయంలో పూజలు చేసిన మంత్రి స్వామి, సత్యలు తర్వాత సూరారెడ్డిపాలెం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, నాయుడుపాలెంలోని అంబేడ్కర్, ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాయుడుపాలెంలో నీరాజనం

స్వగ్రామమైన నాయుడుపాలెంలో మంత్రి హోదాలో వచ్చిన స్వామికి గ్రామస్థులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి డాక్టర్ స్వామి, ఆ గ్రామస్థుడైన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లకు గ్రామస్థులు అభినందన సభ నిర్వహించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బీఎన్ విజయకుమార్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం, దర్శి ఇన్‌చార్జిలు గూడూరి ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్, పలువురు జిల్లా ముఖ్యనేతలు సభలో పాల్గొన్నారు.

కాగా టీడీపీలో రాష్ట్రస్థాయిలో కీలకంగా పనిచేస్తూ పార్టీ కొండపి నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న యువనేత దామచర్ల సత్య ఆధ్వర్యంలో ర్యాలీ, స్వగ్రామంలో అభినందన సభ అట్టహాసంగా జరిగాయి. నియోజకవర్గంలోని ముఖ్యనేతలు, అన్ని గ్రామాల నుంచి టీడీపీ కార్యకర్తలు, అభిమానులతోపాటు ఇతర నియోజకవర్గాలకు చెందిన అనేక మంది ముఖ్యనాయకులు వేలాదిగా హాజరయ్యారు.

బడి బస్సులు భద్రమేనా?

» 42 శాతం వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్

» మిగిలివన్నీ నిబంధనలకు విరుద్ధం

» ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల నిర్లక్ష్యం

» విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

» పట్టించుకోని రవాణాశాఖ అధికారులు

జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యజమానులు బస్సుల ఫిట్‌నెస్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న వారు విద్యార్థుల భద్రతను మాత్రం గాలికొదిలేస్తున్నారు. ఏటా పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి వాహనాలను ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిన వారు ఆ విషయాన్ని అసలు పట్టించుకోవడం లేదు. అనేక మంది కండిషన్‌లో లేని పాత బస్సులను రోడ్లపై తిప్పుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. జిల్లాలో మొత్తం 1,541 బస్సులు ఉంటే ఇప్పటి వరకూ కేవలం 649కి మాత్రమే ఫిట్‌నెస్ చేయించుకున్నారు. ఆర్టీఏ అధికారులు కూడా ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

ఒంగోలు (క్రైం), జూన్ 16 : విద్యా సంస్థలు పునఃప్రారంభమయ్యాయి. ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు బస్సుల్లో వచ్చిపోతుంటారు. ఇందుకు ఏడాదికి రూ.10వేల వరకూవసూలు చేస్తున్నాయి. ఆ వాహనాలు ఎంత భద్రంగా ఉన్నాయోనన్న ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొంది. నిబంధనల ప్రకారం పాఠశాలల యాజమాన్యాలు ఏడాదికి ఒకసారి బస్సును రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ చేయించుకోవాలి. ఆతర్వాతనే రోడ్లమీద తిప్పాలి.

58శాతం బస్సులకు ఫిట్‌నెస్ లేదు!

పాఠశాలలు పునఃప్రారంభం నాటికి బస్సులన్నీ ఫిట్‌నెస్ చేయించుకొని రోడ్లమీదకు రావాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రైవేటు స్కూళ్లకు సంబంధించి 1,541 బస్సులుండగా వాటిలో ఈ ఏడాది ఇప్పటి వరకూ కేవలం 649మాత్రమే ఫిట్‌నెస్ చేయించుకున్నాయి. మిగిలిన 892 బస్సులు ఎలాంటి తనిఖీలు చేయించుకోకుండానే రోడ్లపై తిరుగుతున్నాయి. ఒంగోలు డీటీసీ కార్యాలయం పరిధిలో 832 బస్సులకు గాను 467 వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్ చేయించారు. 365 పెండింగ్‌లో ఉన్నాయి. దర్శి కార్యాలయం పరిధిలో 300 బస్సులుండగా 67కు మాత్రమే ఫిట్‌నెస్ చేయించారు. 233 బస్సులు ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్నాయి. మార్కాపురం ఆర్టీవో కార్యాలయం పరిధిలో 409 బస్సులు ఉండగా 115 ఫిట్‌నెస్ చేయించుకోగా, 294 వాహనాలు ఎలాంటి సర్టిఫికెట్ లేకుండానే తిరుగుతున్నాయి.

ఆటోల్లో ప్రమాదభరిత ప్రయాణం

కొందరు తల్లిదండ్రులు పాఠశాలలకు ఆటోలలో పిల్లలను పంపుతున్నారు. వాటికి సరైన భద్రత లేదు. కిక్కిరిసినట్లు ఆటోల్లో ఎక్కిస్తున్నారు. ఆటోలపైన బ్యాగ్‌లు వేలాడదీస్తున్నారు. డ్రైవర్లు కూడా పిల్లలు ప్రశాంతంగా కూర్చునేందుకు అవకాశం లేకుండా ఎక్కువ మందిని ఎక్కిస్తున్నారు. అసలు వాటిలో భద్రత కన్పించడం లేదు. అయినా తల్లిదండ్రులు స్కూల్ బస్సు ఫీజుల మోతను తట్టుకోలేక ఆటోల్లోనే పంపుతున్నారు.

అధికారుల ఉదాసీనత

స్కూల్ బస్సు రవాణా శాఖ ప్రమాణాలకు తగ్గట్టుగా ఉందా? లేదా? అనేది చూసిన తరువాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలి. పట్టుమని పది నిమిషాల్లో బస్సు ఫిట్‌నెస్ చూసి పంపిస్తున్నారు. ఆ సమయంలో డ్రైవర్ ఫిట్‌నెస్‌ను కూడా చూడాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. నిబంధనల ప్రకారం డ్రైవర్‌కు 50 ఏళ్ల పైబడి వయస్సు ఉండకూడదు. కంటిచూపు సరిగా ఉందా, లేదా అనేది పరీక్ష చేయాలి. ఆరునెలలకు ఒకసారి డ్రైవర్‌కు అన్ని వైద్య పరీక్షలు చేయించాలి. ఆ రిపోర్టులను ఆర్టీఏ అధికారులు చూడాలి. కానీ అలాంటిదేమీ జరగడం లేదు.



స్కూల్ బస్సులో పాటించాల్సిన జాగ్రత్తలు ఇవీ..

ప్రతి బస్సు వెనుక, ఎడమవైపు విద్యా సంస్థ పేరు, పూర్తి చిరునామా సెల్‌ఫోన్ నెంబర్ అందరికీ కనిపించేలా కచ్చితంగా రాయాలి.

బస్సుకు అత్యవసర ద్వారం తప్పని సరిగా ఉండాలి. దానిపై ఆ విషయాన్ని స్పష్టంగా రాయాలి.

డ్రైవర్‌కు లైసెన్స్‌తోపాటు కనీసం ఐదేళ్ల బస్సు నడిపిన అనుభవం ఉండాలి. వయసు 50 సంవత్సరాలకు మించి ఉండకూడదు. ఎప్పటికప్పుడు డ్రైవర్ ఆరోగ్య పరిస్థితిని గమనించాలి.

బస్సులో ఒక సహాయకుడికి విధిగా నియమించాలి.

బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల పూర్తి వివరాలు ఉండాలి.

అగ్నిప్రమాద నివారణ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలి.

కిటికీలకు అద్దాలను ఏర్పాటు చేయాలి

పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదు.

ఫిట్‌నెస్ లేకుండా రోడ్ల మీదకు వస్తే కేసులు

సుశీల, డీటీసీ

పాఠశాల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా రోడ్లమీదకు వస్తే కేసులు నమోదు చేస్తాం. ఈనెల 12 నుంచి ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేయిస్తున్నాం. పాఠశాలల యాజమాన్యాలు వెంటనే బస్సులను ఫిట్‌నెస్ చేయించుకోవాలి.

కాలువ కట్టి.. కనికట్టు చేసి..

» రూ.5 కోట్ల ఆర్అండ్‌బీ స్థలంలో అక్రమ నిర్మాణాలు

» తీరుమార్చుకోని వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి



ఆక్రమణ కోసం నిర్మించిన కాలువ

మార్కాపురం, జూన్ 16: ఒకటికాదు రెండుకాదు ఇప్పటి వరకు ఐదుసార్లు రూ.కోట్లు విలువైన ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు వైసీపీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి ప్రయత్నించారు. గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయడం అక్రమాన్ని నిలిపిశాడు. అయినప్పటికీ, నాడు అధికారం అండ ఉన్న ఆ నాయకుడు మాత్రం తన పట్టు విడవలేదు. తన భూమికి ముందున్న ఆర్అండ్‌బీ స్థలాన్ని ఎలాగైనా కొట్టేయాలని కొత్త ప్రణాళిక వేశాడు. పంచాయతీ నిధులతో రెండు స్థలాల మధ్య కాలువ కట్టి ఆర్అండ్‌బీ స్థలాన్ని వదిలేస్తున్నట్లు గ్రామస్థులను నమ్మించాడు. అంతలోనే రూ.కోట్ల విలువ చేసే ఆర్అండ్‌బీ స్థలాన్ని ప్రస్తుతం చదునుచేసి కొట్టేసేందుకు వేగంగా నిర్మాణాలు చేస్తున్నాడు. అడ్డుకోవాల్సిన అధికారులు జేబులు తడుపుకొని చోద్యం చూస్తున్నారు.

గుట్టుగా ఆక్రమించేందుకు యత్నం

మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలో 856 సర్వే నెంబర్‌లో 3.01 ఎకరాల భూమి ఆర్అండ్‌బీ రోడ్డుకు సంబంధించి ఉంది. ఆ సర్వే నెంబర్‌లో 300 మీటర్ల మేర రోడ్డు ఉంది. కానీ ఎస్సీ కాలనీ సమీపానికి వచ్చేసరికి 50 సెంట్ల భూమి వ్యవసాయ భూములవైపు ఖాళీగా ఉంది. దరిమడుగు గ్రామ సమీపంలో భూములకు గతంలో పెద్దగా ధరలు లేవు. కానీ 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్‌హెచ్ 565 జాతీయ రహదారిని మంజూరు చేయించి పనులు ప్రారంభించింది. దీంతో ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇదే అదునుగా ఆర్అండ్‌బీ స్థలాన్ని ఎలాగైనా కొట్టేయాలని సదరు వైసీపీ మండల ప్రజాప్రతినిధి పక్కనేవున్న భూమిని కొనుగోలు చేశాడు. జాతీయ రహదారి నిర్మాణం పూర్తైన తర్వాత ఒకసారి ఆర్అండ్‌బీ స్థలాన్ని చదునుచేసి ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. టీడీపీ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు నిశబ్ధంగా ఉన్న సదరు నేత వైసీపీ అధికారంలోకి రావడంతో ఒక కొత్త ప్రణాళిక వేశాడు. తన భూమికి ఆర్అండ్‌బీ స్థలానికి మధ్యన పంచాయతీ నిధులతో మురుగు కాలువ నిర్మించాడు. అధికారం అండ ఉండడంతో కాలువ నిర్మాణంలోనే సుమారు 20 సెంట్ల మేర ఆర్అండ్‌బీ స్థలాన్ని తన భూమిలో కలిపేసుకున్నాడు. కొన్నాళ్లపాటు దాన్ని పట్టించుకోలేదు.

ఇటీవల అక్కడ ఒక ట్రాక్టర్ షోరూం నిర్మించేందుకు ముందుగా తన భూమిలో నిర్మాణాన్ని ప్రారంభించాడు. ప్రస్తుతం మురుగు కాలువదాటి ఆర్అండ్‌బీ స్థలాన్ని కూడా ఆక్రమించేశాడు. నిర్మాణాలు పూర్తి చేస్తే తనను ఎవరూ పట్టించుకోరనే ధీమాతో హడావుడిగా పనులు చేస్తున్నాడు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్థిని వైసీపీ నాయకుడు కాజేస్తున్నా.., అధికార యంత్రాంగం మాత్రం చక్కగా జేబులు నింపుకొని చోద్యం చూస్తోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆర్అండ్‌బీ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

» భార్యాపిల్లలకు గాయాలు

కోవూరు, జూన్16: కుమార్తె, కుమారుడి వేసవి సెలవుల్ని సొంత ఇంట్లో ఆనందంగా గడిపి, పాఠశాలలు తెరుస్తుండటంతో చెన్నైకి బయలుదేరిన ఓ కుటుంబంపై విధి పంజా విసిరింది. చిన్నారులకు తండ్రిని, భార్యకు భర్తను వేరుచేసింది. ఈ హృదయ విదారక ఘటన నెల్లూరు జిల్లా కోవూరుకు సమీపంలోని జాతీయరహదారిపై ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళ్తే...

బాపట్ల జిల్లా బల్లికురవ మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన కూరపాటి మురళీమోహన్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. సెలవులకు భార్యాపిల్లలతో సహా చెన్నై నుంచి స్వగ్రామానికి వచ్చి తిరిగి కారులో వెళ్తుండగా అనపల్లి కన్వెన్షన్ సెంటర్ సమీపంలో అదే మార్గం లో వెళ్తున్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మురళీమోహన్(32) అక్క డికక్కడే మృ తి చెందారు. మృతదేహం డ్రైవింగ్ సీట్లోనే ఇరుక్కుపో యింది. ప్రమాదంలో ఆయన భార్య ప్రసన్న, కుమారుడు, కుమార్తెలు గాయపడ్డారు. గాయపడ్డ ఇద్దరిని 108వాహనంలో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ప్రమాదస్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా జాతీయ రహదారిపై ఆ సమయంలో వెళ్తున్న ప్రయాణికులు ప్రమాదాన్ని చూసి నిర్ఘాంతపోయారు. భర్తను కోల్పోయి విలపిస్తున్న భార్య ప్రసన్ననూ, తండ్రి మృతి చెందడంతో రోదిస్తున్న కుమారుడు, కుమార్తెలను చూసి వేదనకు గురయ్యారు. మృతుడు మురళీ మోహన్ గొంతు ప్రాంతంలో తగిలిన గాయాన్ని చూసి పలువురు నిశ్చేష్టులయ్యారు. మృతదేహాన్ని తీసేందుకు కూడా పోలీసులు ఇబ్బందులు పడ్డారు.



కారులో ఇరుక్కున్న మృతదేహం

సముద్ర తీరంలో మృత్యుఘోష..!

- గడిచిన వారంలో మూడో ఘటన
- ఇద్దరి మృతి.. ఆచూకీ లేని మూడో వ్యక్తి
- బాధితుల కుటుంబాల్లో విషాదం
- పోలీసులకు తలనొప్పిగా ప్రమాదాలు

వాడరేవు(చీరాలటౌన్), జూన్ 16 : తల్లిదండ్రులు వారి పిల్లలను ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుని, కూలినాలి, అప్పుసప్పు చేసి, వివిధ వృత్తులలో ఎంతో కష్ట పడి చదివిస్తున్నారు. చాలా ఇబ్బందులు, గండాలు దాటుకుని పిల్లలు బాగానే చదువుకుంటున్నారు. అంతవరకు బాగానే ఉంది. కానీ ఏదో ఒక సమయంలో స్నేహితులతో కలిసి సరదాగా వేసే ట్రిప్పులతో ప్రమాదాలు కొనితెచ్చుకుని విద్యార్థులు మృత్యుకౌగిట్లోకి చేరుతున్నారు. దీంతో అప్పటిదాకా పిల్లలపై పెంచుకున్న ఆశలు, మమకారాలు ఒక్కసారిగా గాలిలో కలిసి ఆ కుటుంబాలలో విషాదాలు నిండుతున్నాయి. ఇటీవల సముద్ర తీరాన మృత్యుఘోష పలు ఘటనలకు తార్కానంలా మారింది.

వాడరేవు, రామాపురం సముద్రతీరాల్లో ఈవారంలోనే మూడో ఘటన చోటుచేసుకోవడంతో పోలీసులు వీరిని ఏవిధంగా అదుపు చేయాలో అర్థంకాక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పటికే పోలీసులు అన్ని విధాలా ప్రమాదాలపై పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్నా యువకులు వారి కళ్లుగప్పి జనసంచారం లేని ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ఈతకు దిగిన కొద్దిసేపటికే గల్లంతై మృత్యు కెరటానికి బలవుతున్నారు.

ఈక్రమంలోనే ఈ నెల 9వ తేదీన చీరాల మండలానికి చెందిన కాటి జయపాల్(18), 12వ తేదీన తాడేపల్లిగూడెంకు చెందిన కనగళ్ల గౌరీష్(21) మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాల్లో బిడ్డను పోగొట్టుకున్న తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. తాజాగా ఆదివారం మరో ఘటన చోటుచేసుకుంది. నూజివీడుకు చెందిన క్రోసూరి కార్తీక్ (20) బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. మరో పది మంది మిత్రులతో కలిసి ఆదివారం వాడరేవు సముద్రతీరానికి సరదాగా మునిగేందుకు వచ్చారు. ఈక్రమంలో మైలవరానికి చెందిన మైలవరపు కేదారేశ్వరరావుతో కలిసి ఈత ప్రారంభించాడు. నిమిషాల్లోనే అలలు కార్తీక్‌ను లోనికి లాగాయి. అయితే కార్తీక్‌ను కేదారేశ్వరరావు లాగే ప్రయత్నం చేసినా కూడా ప్రయోజనం లేదు. ఈ నేపథ్యంలో కార్తీక్ ఆచూకీ గల్లంతవ్వగా మెరైన్, రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇంకా మృతదేహం లభ్యం కాలేదు. అయితే కేదార్ మాత్రం చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.


గల్లంతైన కార్తీక్ (ఫైల్)


చికిత్స పొందుతున్న కేదారేశ్వరరావు


పాదయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

అమరావతి రైతుల పాదయాత్ర

- కాలినడకన వెంకటపాలెం నుంచి తిరుపతికి
- ఇంకొల్లులో ఘనస్వాగతం పలికిన టీడీపీ నాయకులు

ఇంకొల్లు, జూన్ 16 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి అమరావతినే ఏకైక రాజధానిగా ప్రకటించడంతో అమరావతి రైతులు కాలినడకన తిరుపతికి బయలుదేరారు. ఈ నెల 13వ తేదీన అమరావతి సమీపంలోని వెంకటపాలెం టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభించిన పాదయాత్ర 4వ రోజుకు ఆదివారం ఇంకొల్లు చేరుకుంది. పాదయాత్రగా వచ్చిన 15 మంది రైతులకు పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అమరావతి రైతులు జొన్నలగడ్డ భాస్కరరావు, పువ్వాడ వెంకటేశ్వర్లు, అల్లూరి శ్రీనివాసరావు, జనార్దనరావు, బాలచంద్రరావు, విశ్వేశ్వరరావు, శేఖర్, శివశంకర్, కృష్ణమోహన్, రంగారావు, రమణ, శివ గంగవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొట్టిపాటి వెంకటేశ్వర్లు వీరికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం దుద్దుకూరులో భోజనాలను ఏర్పాటు చేసారు. ఇంకొల్లు మండలంలో కొణికి, దుద్దుకూరు గ్రామాలలో కొనసాగిన పాదయాత్రలో రైతులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కరి శ్రీను, మార్క్, బోడావుల శివయ్య, బోడెంపూడి సుబ్బారావు, కరి వీరాంజనేయులు, రామకృష్ణ, వలేటి రమేష్, వాసు, కల్లెంపల్లి వెంకటేశ్వర్లు, బలరాం, అనంతలక్ష్మి, విజయలక్ష్మి, వలేటి సుబ్బాయమ్మ, సాంబయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూనూరులో చోరీకి యత్నం

యద్దనపూడి (మార్టూరు) జూన్ 16 : యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి గుర్రం లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి చెందిన వస్త్ర దుకాణంలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు చోరీకి ప్రయత్నించిన సంఘటన జరిగింది. ఈ చోరీలో దొంగతనానికి వచ్చిన యువకులు ఒక ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలిపారిపోయారు. అందిన సమాచారం మేరకు గుర్రం లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి చెందిన వస్త్ర దుకాణంలో యువకులు చోరీకి ప్రయత్నించారు.వారు ఒక బైక్, మరో టీవీఎస్ వాహనంపై దొంగతనానికి వచ్చారు. గ్రామంలో లక్ష్మీ నారాయణ నివాస గృహం ఒక చోట మరో చోట వస్త్ర దుకాణం ఉంది. అయితే అర్ధరాత్రి సమయంలో వస్త్ర దుకాణం షట్టర్‌ను పైకి లేపి యువకులు సెల్‌ఫోన్‌తో దుకాణంలో వస్త్రాలను పరిశీలిస్తున్నారు. ఈ విషయాన్ని అక్కడ పరిసరాల్లోని ఇంటిలో నివసించే వ్యక్తులు గమనించి ఈ విషయాన్ని సెల్‌ఫోన్‌లో లక్ష్మీనారాయణకు సమాచారం అందించారు. దాంతో లక్ష్మీనారాయణ కొంతమంది వ్యక్తులను తీసుకొని దుకాణం వద్దకు రాగా ఈ విషయాన్ని గమనించిన ఇద్దరు యువకులు దుకాణం నుంచి బయటకు వచ్చి టీవీఎస్ వాహనంపై పరారయ్యారు. వారు టీవీఎస్ వాహనంపై ఏమైనా వస్త్రాలను తీసుకుపోయారో లేదో ఎవరూ గమనించలేదు. అదేవిధంగా వారు తీసుకు వచ్చిన బైక్‌ను మాత్రం అక్కడే వదిలివేసి పరారయ్యారు. వస్త్ర దుకాణంలో సరుకు ఏమైనా పోయిందా అనే విషయమై లక్ష్మీనారాయణ ఇతిమిద్ధంగా సమాధానం చెప్పలేదు. ఈ విషయంపై స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.


ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి గొట్టిపాటి

వైద్యశాఖ మంత్రికి గొట్టిపాటి శుభాకాంక్షలు

అద్దంకి, జూన్ 16 : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను అమరావతిలోని సచివాలయం వద్ద ఆదివారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి గా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన సత్యకుమార్‌ను విద్యుత్ శాఖ మంత్రి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బక్రీద్ శుభాకాంక్షలు

ముస్లిం సోదరులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిభావం, కరుణ, సహనాన్ని బక్రీద్ చాటిచెప్తుందన్నారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్‌ను జరుపుకుంటున్నారన్నారు. బక్రీద్ దేవుని పట్ల సంపూర్ణ భక్తి భావం, పేదల పట్ల సాయం, ఇతరుల పట్ల సోదరభావం పెంపొందిస్తుందన్నారు. అందరికి అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని ఆకాంక్షించారు.

నేడు మంత్రి గొట్టిపాటి ముప్పవరం రాక

జెపంగులూరు జూన్ 16: విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఉదయం 10 గంటలకు మండలంలోని ముప్పవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటారని చిలకలూరిపేటలోని క్యాంపు కార్యాలయం ఆదివారం ప్రకటనలో తెలిపారు.

వైభవంగా హనుమ సాయి వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

చినగంజాం, జూన్ 16 : హనుమ సాయి కుటీరంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో సప్తదశమ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. షిరిడీ సాయి మందిరంలోని మహాగణపతి, దత్తాత్రేయ. ధ్యానాంజనేయ, సుబ్రహ్మణ్యస్వామి సహిత సాయిబాబా వారి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ సప్త దశమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. వేకువజామున బాబా చిత్రపటంతో చినగంజాం గ్రామ పుర వీధులలో భక్తులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి సాయినాథునికి సుప్రభాతసేవ, కాకడహారతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర పూజలు జరిపారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో సాయికి నూతన వస్త్రాలతో, పలు రకాల పూలమాలలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుణ్యాహవాచన. మంటపారాధన, బాబావారికి, ఆస్థాన పరివార దేవతలకు పంచామృత మహన్యాస పూర్వక అభిషేక కార్యక్రమాలు, అలంకారములు, సహస్రనామార్చన, నివేదన, హారతి తదితర పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. మందిరంలో చినగంజాం సత్యసాయి సేవా కమిటీ సభ్యులు భజనా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ధునిలో కొబ్బరికాయలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాగంణంలో మధ్యాహ్నం రెండు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. శ్రీహనుమసాయి కుటీర ట్రస్టు సభ్యులు, అంకిత సాయి భక్తులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

ఇంకొల్లు, జూన్ 16 : పెరిగిన గ్యాస్ ధరలు తగ్గించాలని పర్చూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి పొన్నగంటి జానకిరామారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఇంకొల్లులో ఆటోనగర్‌లో సిలిండర్‌ను భుజం మీద పెట్టుకొని నిరసన వ్యక్తపరిచారు. కార్యక్రమంలో సుభాని, మౌలాలి, అంకమ్మ, మౌలీషరీఫ్, నవీద్ పాల్గొన్నారు.

టీసీసీకి 1లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలకు జూలై 1వ తేదీలోపు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు రూ.150 చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. రూ.50 రుసుంతో 6వతేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్ష రాసేందుకు 42 రోజులు శిక్షణ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. పరీక్ష విశాఖపట్నం, కాకినాడు, గుంటూరు, కడప, అనంతపురంలో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆదరించారు.. అండగా ఉంటా

ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూన్ 16 : నియోజకవర్గ ప్రజలు నన్ను అభిమానించారు. ఆదరించారు. వారికి అండగా ఉంటానని, అభివృద్ధిలో ముందుంటానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని బచ్చులవారిపాలెం పోలేమర్మ అమ్మవారిని ఆదివారం కొండయ్య దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో భక్తులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల మండలం తోటవారిపాలెం పోలేమర్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటవారిపాలెం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తామన్నారు. అందుకు సమిష్టి కృషి అవసరమన్నా రు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బచ్చులవారిపాలెం పోలేరమ్మకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


మొక్కు తీర్చుకునేందుకు వెళ్తున్న టీడీపీ శ్రేణులు

పెనుగంచిప్రోలులో శ్రేణుల మొక్కులు

అద్దంకి, జూన్ 16 : టీడీపీ శ్రేణులు ఆదివారం పెనుగంచిప్రోలులో మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడం, అద్దంకి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ విజయం సాధించడం, ఆయనకు మంత్రి పదవి దక్కడంతో మండలంలోని కలవకూరు, గుర్రంవారిపాలెం టీడీపీ శ్రేణులు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం పెనుగంచిప్రోలు వెళ్లి లక్ష్మీతిరుపతమ్మకు మొక్కులు తీర్చుకున్నారు.

ధరల అదుపునకు చర్యలు చేపట్టాలి

చీరాలటౌన్, జూన్ 16 : ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని వెంటనే అధికారులు ధరలను అదుపు చేయాలని కాప్కో సంస్థ ప్రతినిధులు దాసరి ఇమ్మానియేల్, ఎస్.రామకృష్ణ డిమాండ్ చేశారు. కూరగాయలు, బియ్యం, ఉల్లి, పప్పుదినుసుల రేట్లు మోత మోగుతున్నాయన్నారు. దీంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ద్వారా, రైతు బజార్లలో సబ్సిడీపై అమ్మకాలు చేయాలని కోరారు.


మహిళను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పేదలకు అండగా ఉంటాం

వేటపాలెం(చీరాల), జూన్ 16 : ఎన్నికలకు ముందు.. తరువాత.. అప్పుడు .. ఇప్పుడు .. ఒకే తీరు ... అందరికీ అండగా ఉంటాం. పేదల పక్షపాతిగా కొనసాగుతానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సజ్జావారివీధిలోని టీడీపీ సీనియర్ నాయకుడు నాశిక వీరభద్రయ్య ఇంట ఆదివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా గెలుపొందిన కొండయ్యకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపినందుకు కృతజ్ఞతలన్నారు. అయితే గెలుపు మనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. సమిష్టి కృషితో అందరికీ సమన్యాయం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఆ వీధిలోని వారిని పలకరించి వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో అన్ని సమస్యలనూ పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నాశిక వీరభద్రయ్య, గుత్తి పరమేశ్వరరావు, పిచ్చుక వెంకటసుబ్బారావు, గుత్తి హేమసుందరరావు, సజ్జా రమేష్ బాబు, బొడ్డు ముసలయ్య, బొడ్డు శ్రీనివాసరావు, నాశిక వెంకటేశ్వర్లు, నాసిక కోటేశ్వరరావు, గుత్తి నాగభూషణం, ఉమామహేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నం పెట్టాను.. డబ్బులు ఇప్పించండి సారూ

- ద్రోణాదులలో బాధితురాలి ఆవేదన
- మహిళా రెవెన్యూ అధికారి నిర్వాకం
- బిల్లు చెల్లించాలని విజ్ఞప్తి

మార్టూరు, జూన్ 16 : పెరుగు అన్నం పెట్టాను.. అన్నం ప్యాకెట్లను అందించాను. మహిళా అధికారి చెప్పిందని పంపించాను.. వాటికి సంబంధించిన డబ్బులను నేటికీ ఇవ్వలేదని బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఏ దిక్కూ లేక ఒంటరిగా జీవిస్తున్న తనకు డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని ఆ మహిళ అధికారులను వేడుకుంటున్నది. పత్తిపాటి అమృత వల్లి ద్రోణాదుల గ్రామ ప్రధానసెంటర్‌లో చిన్న భోజనహోటల్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తుంది. గతనెల 13వతేదీన అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ద్రోణా దులలో పోలింగ్ రోజున పోలింగ్ సిబ్బందికి భోజనాలను వండి పంపించాలని మహిళా రెవెన్యూ అధికారి అమృత వల్లిని కోరారు. దాంతో భోజనం ప్యాకెట్ రూ.90 వంతున 100 ప్యాకెట్లను ఉదయం పంపించారు. అదేవిధంగా సాయంత్రం పెరుగు అన్నం ప్యాకెట్ రూ.50 వంతున 50 ప్యాకెట్ల అమృత వల్లి సిబ్బందికి పంపించారు. భోజనం బి ల్లు మొత్తం రూ.11,500 రా వల్సి ఉందని మహిళా అధికారికి అమృతవల్లి చెప్ప గా, కేవలం రూ.3వేలు ఇచ్చారని, మిగతా రూ.8500 డబ్బులు నేటికీ ఇవ్వలేదని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు. కొన్ని రోజులు ఫోన్ చేస్తే బిల్లులు రాలేదని చెప్పారని తర్వాత ఆమె ఫోన్ కూడా పనిచేయడం లేదన్నారు. ఈ అధికారి పేరు కూడా తనకు తెలియదన్నారు. గ్రామంలోని అధికారి చెప్పారని రూ.10 తక్కువకే భోజనం వండి పంపించానని తెలిపారు. ఈ విషయమై సచివాలయం వద్దకు వెళ్లి అడిగినా ఎవరూ సమాధానం చెప్పడం లేదని వాపోయారు. పై అధికారులు కనికరించి తనకు డబ్బులు ఇప్పించాలని అమృతవల్లి వేడుకున్నారు.


హోటల్ వద్ద దిగాలుగా కూర్చున్న అమృతవల్లి


ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మ

స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లకు సర్వం సిద్ధం

స్వర్ణ(పర్చూరు), జూన్ 16: కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 17 నుంచి 19వరకు ఆలయంలో విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరునాళ్ల తొలిరోజు అమ్మవారికి పుట్టింటి నుంచి పసుపు కుంకుమ సమర్పించడం అనవాయితీగా వస్తుంది. దీంతో సోమవారం అమ్మవారికి పసుపు కుంకుమ అందజేయనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నారెడ్డి వేణుగోపాలరావు తెలిపారు. అదేవిధంగా 18న తిరునాళ్ల, 19న అమ్మవారికి పొంగళ్లను సమర్పిస్తారని తెలిపారు.

వెయ్యి సంవత్సరాల చరిత్ర కల్గిన స్వర్ణమ్మ తల్లికి స్వర్ణ గ్రామంతో విశిష్ట అనుబంధం ఉంది. వరదలు సంభవించినప్పుడు చీరాల నుంచి వరద నీరు స్వర్ణ గ్రామాన్ని ముంచెత్తిన తరుణంలో స్వర్ణమ్మ తల్లి తన పైటకొంగును అడ్డుపెట్టి గ్రామాన్ని కాపాడిందని భక్తుల నమ్మకం. దీంతో స్వర్ణమ్మ తల్లిని తమ కోర్కెలు తీర్చే గ్రామదేవతగా పూజిస్తూ గ్రామస్థులు భక్తిని చాటుకుంటున్నారు. గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా తొలి శుభలేఖను అమ్మవారికి సమర్పించిన తరువాతే పనులను నిర్వహించుకోవటం అనవాయితీగా వస్తుంది. నూతన వాహనాలు కొనుగోలు చేస్తే కుటుంబ సభ్యుల పేర్లుకంటే ముందుగా స్వర్ణమ్మ తల్లి పేరును వాహనాలపై ముద్రించి తమ భక్తిని చాటుకుంటారు.

ఇంకొల్లు రోటరీకి ఉత్తమ అవార్డు


అవార్డులను అందుకుంటున్న అధ్యక్షుడు కమలేశ్వరరావు

ఇంకొల్లు, జూన్ 16 : భద్రాచలంలో ఆదివారం జరిగిన రోటరీ జిల్లా 3150 అవార్డుల ప్రదానోత్సవంలో ఇంకొల్లు రోటరీక్లబ్ ఉత్తమ అవార్డులకు ఎంపికైంది. జిల్లా గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకరరెడ్డి చేతుల మీదగా క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు అవార్డులను అందుకున్నారు. రోటరీక్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ సేవలందించడంలో ముందంజలో ఉండడంతో ఉత్తమ క్లబ్‌గా రెండవ స్థానం, ఉత్తమ క్లబ్ అధ్యక్షుడిగా కమలేశ్వరరావుకు రెండవ స్థానంగా ఎంపిక చేసి అవార్డులను అందజేశారు. వ్యాధుల నివారణ, చికిత్స విభాగంలో, సమాజ ఆర్థికాభివృద్ధిలో, ప్రాథమిక విద్య, అక్షరాశ్యత విభాగంలో మెరుగైన సేవలందించినందుకు అభినందనలు, ప్రశంసాపత్రాలను అందజేసినట్లు కమలేశ్వరరావు తెలిపారు.

డిప్లమో కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 16 : వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీలో డిప్లొమో కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న యువతీ, యువకులు ఈనెల 20లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు బి.ఉదయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, టెన్త్‌తోపాటుఐటీఐ రెండేళ్ల పాటు ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిప్లమో ద్వితీయ సంవత్సరం ప్రవేశం ఉంటుందన్నారు. ప్రథమ సంవత్సరంలో నెలకు రూ.వెయ్యి, ద్వితీయ సంవత్సరంలో రూ.1100, తృతీయ సంవత్సరంలో రూ.1200 చొప్పున ఉపకార వేతనం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9648483727 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎంసెట్ ఫలితాల్లో శ్రీ మేధావి ప్రతిభ

చీరాలటౌన్, జూన్ 16 : ఇంటర్, ఎంసెట్ ఫలితాల్లో శ్రీ మేధావి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు డైరక్టర్ ఎంవీ దుర్గారావు తెలిపారు. ఈఏడాది విద్యా సంవత్సరంలో విడుదలైన జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎం.భవ్యశ్రీ, ఎ.నవ్య 464, బైపీసీలో ఐఎల్ గ్రీష్మంత్ 428, ఎంఈసీలో హర్షిత 479 మార్కులు సాధించినట్లు చెప్పారు. అంతేకాకుండా జూనియర్ ఇంటర్‌లో సీఈసీలో వీఎస్ హర్షిణి 446 మార్కులు, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో వీణ ప్రసన్న 986, బైపీసీలో ఎల్.కనకదుర్గ 977 మార్కులు సాధించినట్లు ఎంసెట్ మెడిసిన్‌లో విజయలక్ష్మి 2589, ఇంజనీరింగ్‌లో సాహితి 11278, ఇంజనీరింగ్‌లో 15వేల లోపు ర్యాంకులు మరో పదిమంది సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనాల కేసుల్లో ఐదుగురు అరెస్ట్

రూ.4.20 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

అద్దంకి, జూన్16 : అద్దంకి పట్టణంలో ఒకే రోజు జరిగిన మూడు దొంగతనాలకు సంబంధించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. ఈనెల 5వ తేదీన అద్దంకి పట్టణంలోని మూడు చోట్ల ఐదుగురు దొంగలు చోరీలకు పాల్పడ్డారు. చోరీలకు పాల్పడిన ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం రామభద్రాపురానికి చెందిన వడిసిన వేణుగోపాలరెడ్డి, చీమకుర్తి పట్టణానికి చెందిన షేక్ తరుణ్ (రఫీ), నూతలపాటి రాధాకృష్ణ, చింతలపూడి శివప్రసాద్, చింతలపూడి నరసింహారావును ఆదివారం ఉదయం అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4.20 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య తెలిపారు.

అదిగో రుణం అంటే ఇదిగో రోడ్డు అన్నారు... మాకు మించి రోడ్లు బాగు చేసేవారు మరొకరు లేరు అన్నట్లు ప్రచారం చేసుకున్నారు... వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) నిధులతో ఉమ్మడి జిల్లాలో 222 రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఆర్భాటపు ప్రకటనలు చేసుకున్నారు.. తీరా చూస్తే అంతా తుస్..! ఐదేళ్లు దర్జాగా పదవులు అనుభవించి వైసీపీ ప్రజాప్రతినిధులు జారుకున్నారు... కానీ ప్రజలకు మాత్రం అవస్థలు రెట్టింపయ్యాయి. ఒక్కసారి గ్రామీణ రహదారులను పరిశీలిస్తే ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతుంది. ఆ రోడ్లపై ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. పది నిమిషాల్లో ప్రయాణిం చాల్సిన దూరానికి అర్ధగంట సమయం పట్టడమే కాకుండా ఒళ్లు గుల్లవుతోంది. ఈ రోడ్లను పూర్తిగా అభివృద్ధి చేయడం అటుంచితే అత్యవసరంగా ప్యాచ్‌లైనా వేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



ఏఎస్‌పేట: గుంతలతో అధ్వానంగా మారిన దూబగుంట రోడ్డు

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- ప్రచారం తప్ప పనులు శూన్యం
- ప్రజలకు నరకం చూపిస్తున్న రహదారులు
- రెండేళ్ల క్రితం ఏఎంసీ నిధులతో 222 వర్కుల మంజూరు
- పూర్తయింది 15 మాత్రమే..
- బ్యాంకు రుణం రాలేదు.. బిల్లులు కాలేదు!
- 71 పనులకు టెండర్లే వేయని కాంట్రాక్టర్లు



మనుబోలు: అధ్వానంగా ఉన్న మనుబోలు నుంచి పిడూరు గ్రామానికి వెళ్లే రోడ్డు

నడక దారులే నయం!

గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన కనెక్టివిటీ రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం ప్యాచ్‌లు వేసే దిక్కు కూడా లేకుండా పోయింది. ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండడంతో జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రతి జడ్పీ సమావేశంలో ఈ రోడ్ల దుస్థితిపై నోరు విప్పారు. ప్రజలు తిడుతున్నారయ్యా... మా రోడ్లను బాగు చేయండి... అంటూ మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. అయితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో 2022లో ప్రధాన కనెక్టివిటీ రోడ్లను ఏఎంసీ నిధులతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం 222 రోడ్ల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ అనుమతులిచ్చింది. అయితే ఆ తర్వాత ఈ రోడ్ల అభివృద్ధికి బ్యాంకులు రుణం మంజూరు చేయలేదు. ఏఎంసీల ఆదాయాన్ని ష్యూరిటీగా పెట్టినప్పటికీ బ్యాంకులు రుణం ఇచ్చేందుకు ముందుకు రాలేదు. ఇలా ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా రుణం మంజూరు కాలేదంటే అప్పటి ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రుణం మంజూరు కాకుండానే పంచాయతీ రాజ్ ఇంజనీర్లు ఈ రోడ్లకు టెండర్లు పిలిచారు. 222 వర్కులను 38 ప్యాకేజీలుగా విభజించి మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఎన్నికలకు ముందు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో కొందరు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేసినా అగ్రిమెంటు చేసుకునేందుకు ముందుకు రాలేదు. ఇప్పటి వరకూ కేవలం 4 ప్యాకేజీలకు మాత్రమే అగ్రిమెంట్లు చేసుకోగా, ఇంకా 26 ప్యాకేజీలకు అగ్రిమెంట్లు చేయాల్సి ఉంది. రెండేళ్లలో పూర్తయింది కేవలం 15 వర్కులు మాత్ర మే..! మరో 45 రోడ్డు పనులను ప్రారంభిం చినా కూడా అవి పూర్తి కాలేదు. ఇంకా 91 వర్కులు అసలు ప్రారంభమే కాలేదు. మరో 71 రోడ్డు పనులకు ఎవరూ టెండర్లు వేయలేదు. ఇప్పటి వరకూ అరకొరగా పనులు జరిగినా ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం బిల్లు ఇవ్వకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. కాగా బ్యాంకు రుణం రాకపోవడంతో నాబార్డు నుంచి రుణం కోరేందుకు ప్రతిపాదనలు పంపారు. అక్కడ 222 వర్కులకు గానూ 129 వర్కులకు మాత్రమే ఈ ఏడాది ఫిబ్రవరిలో రుణం మంజూరైంది. మిగిలిన వర్కుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాబార్డు రుణం మంజూరు చేశాక రివైజ్డ్ ఎస్టిమేషన్లతో పంచాయతీరాజ్ ఇంజనీర్లు మిగిలిన వర్కులకు మరోసారి టెండర్లు ఆహ్వానించగా అప్పుడు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ తీరే ఇందుకు ప్రధాన కారణం. ఈ గ్రామీణ కనెక్టివిటీ రోడ్లను అత్యవసరంగా బాగు చేయాల్సి ఉంది.



సంగం: దారుణంగా తయారైన సంగం- పల్లిపాలెం రహదారి

కొన్నింటికి రుణం మంజూరు కాలేదు

మొత్తం 222 రోడ్డు వర్కులకుగానూ 129 వర్కులకు నాబార్డు నుంచి రుణం మంజూరైంది. అయితే ఇప్పటికే టెండర్లు పిలిచి ఉన్న కొన్ని వర్కులకు మాత్రం రుణం మంజూరు కాలేదు. ఈ విషయంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అగ్రిమెంట్లు పూర్తి చేసి పనులు మొదలుపెట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- అశోక్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ



అనంతసాగరం: అభివృద్ధికి నోచని బెడుసుపల్లి రోడ్డు



బక్రీద్ సందర్భంగా నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గాలో ఏర్పాట్లు

నేడు బక్రీద్

- జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 16: జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సోమవారం బక్రీద్‌ను జరుపుకోనున్నారు. త్యాగానికి గుర్తుగా నిర్వహించే ఈ పండుగ ప్రార్థనల కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. బక్రీద్‌కు ఏర్పాట్లు చేయాలని కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు అధికారులను ఆదేశించారు. అందుకు తగ్గట్లుగా వారు ఏర్పాట్లు చేశారు. ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం నెమరువేసే జంతువులయిన ఒంటె, మేక, గొర్రె, ఎడ్లను బలి ఇస్తారు. వాటి మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధువులకు పంచుతారు. మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. అల్లాహ్ ఆదేశానుసారం ఇబ్రహీమ్ (సో.అ.స) తన ఏకైక పుత్రుడు అయిన ఇస్మాయిల్‌ను బలి ఇచ్చేందుకు సిద్ధమవుతారు. దైవం కోసం తండ్రీకొడుకులు చేసిన త్యాగానికి గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాలలో బక్రీద్ ప్రార్థనలు జరగనున్నాయి. ఉదయం 6.30 నుంచి మసీదుల్లో, ఉదయం 10.15 గంటలకు ఈద్గా మైదానాల్లో సామూహిక బక్రీద్ ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ఘనంగా జనసేన విజయోత్సవం

- ర్యాలీకి వేలాదిగా తరలివచ్చిన జనసైనికులు
- ఇది సామాన్యుడి పండుగ : అజయ్‌కుమార్

నెల్లూరు(క్రైం), జూన్ 16: జనసేన పార్టీ రాష్ట్రంలో పోటీ చేసిన అన్నిస్థానాల్లో విజయఢంకా మోగించడంతో ఆ పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నెల్లూరు నగరంలో విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. నగరంలోని కేవీఆర్ పెట్రోలు బంకు నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ ప్రధాన బస్టాండు, వీఆర్‌సీ, గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండు మీదుగా స్టోన్‌హౌస్ పేటలోని జలకన్య విగ్రహం వరకు సాగింది. ప్రతి సెంటర్‌లోనూ వేలాది మంది జనసైనికులు, వీరమహిళలు, పవన్‌కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేస్తూ, జై జనసేన.. జైజై జనసేన... అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా వేములపాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలతో సతమతమవు తున్న ప్రజలకు జనసేన విజయం దీపావళి పండుగ లాంటిదని అన్నారు. రానున్న రోజుల్లో సామాన్యుడి సమస్యలను పరిష్కరించి, ప్రజారంజక పాలన సాగించేలా కృషి చేస్తామన్నారు. జనసేన పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా భారీ విజయాన్ని అందించిన ప్రజలతో కలిసి ఆనందాన్ని పంచుకునేందుకు విజయోత్సవ ర్యాలీని చేపట్టామన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం, ప్రతి సామాన్యుడు, అన్ని వర్గాలవారు జనసేనకు మద్దతు ఇవ్వడంతోనే కూటమి విజయం సాధ్యమైందన్నారు. ఈ ర్యాలీలో జనసేన పార్టీ వీరమహిళ ఆదికేశవుల చైతన్య, జిల్లా నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, గునుకుల కిషోర్, వై రవికుమార్, కృష్ణారెడ్డి, గుర్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన జనసేన ర్యాలీ


కీలక పోస్టు కోసం పైరవీలు!

- జిల్లా సైన్స్ అధికారి పోస్టుకు పెరిగిన డిమాండ్
- నిబంధనలకు విరుద్ధంగా అడుగులు
- రాష్ట్రస్థాయిలో ఆశావహుల లాబీయింగ్
- విద్యాశాఖలో రహస్యంగా సమావేశాలు

నెల్లూరు (విద్య), జూన్ 16: ఎంతో కీలకమైన జిల్లా సైన్స్ అధికారి పోస్టుకు పెద్దఎత్తున పైరవీలు జరుగుతున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చసాగుతోంది. గతంలో నిబంధనలకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయుడు, అంతకంటే ఎక్కువ హోదా కలిగినవారు మాత్రమే నిర్వర్తించే ఈ బాధ్యతను కొన్నేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా భర్తీ చేస్తున్నట్లు టీచర్లు ఆరోపిస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి తనకు కావాల్సిన వ్యక్తిని సైన్స్ అధికారిగా నియమించేలా పావులు కదిపారు. అప్పట్లో డీఈవోగా పనిచేసిన అధికారి అందుకు ససేమిరా అనడంతో ఆయన్ను తీవ్ర పదజాలంతో దూషించాడు. అంతేకాక పలు ఇబ్బందులకు గురిచేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆ మాజీ మంత్రి అనుచరుడికే జిల్లా సైన్స్ అధికారి బాధ్యతను అప్పగించారు.

జిల్లా సైన్స్ విభాగం పాఠశాలల్లో సైన్స్ ప్రదర్శనలు నిర్వహించడం, జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లు ఏర్పాటు చేయడం, సైన్స్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం వంటివి చేయాలి. ఇందుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్ద ఎత్తున నిధులు సమకూరుతాయి. అంతేకాక జిల్లాలోని దాతలు పెద్దఎత్తున విరాళాలు కూడా అందచేస్తారు. దీంతో ఈ పోస్టుకు డిమాండ్ పెరిగిందని విద్యాశాఖ వర్గాలు చెబుతు న్నాయి. గతంలో జిల్లా సైన్స్ అధికారి పోస్టుతోపాటు కార్యక్రమాల నిర్వహణకు కూడా తమసొంత మనుషులనే కమిటీ సభ్యులుగా నియమించుకుని రూ.లక్షలు స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. అందుకే ఈ పోస్టును పొందేందుకు రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులకు పెద్దఎత్తున నిధులు సమకూర్చడంతో పాటు వచ్చే నిధులను కూడా తమకు అనుకూలంగా వినియోగించుకోవచ్చన్న దురాశతోనే పైరవీలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. గజిటెడ్ హోదా కలిగిన వారు నిర్వహించాల్సిన ఈ బాధ్యతలను బీఈడీ అసిస్టెంట్ స్థాయివారికి ఇస్తుండ డంతో సైన్స్ విభాగం అస్తవ్య స్తంగా తయారైందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ పోస్టును తమకు అనుకూలమైన వారికే అప్పగించా లని రాష్ట్రస్థాయిలో ఉండే ఓ విద్యాధికారి, జిల్లాస్థాయి అధికారులు కలిసి రహస్య సమావేశాలు నిర్వహిస్తూ, అందరినీ ఒప్పించే పనిలో నిమిగ్నమయినట్లు గుసగుసలు వినిపిస్తు న్నాయి. ఇటీవల ఓ దాత రూ.15 కోట్లను జిల్లా సైన్స్ కేంద్రానికి అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారని, ఇప్పటికే రూ.కోట్ల నిధులు రావడం, కార్యక్రమా లకు దాతలు రూ.లక్షలు అందించనుం డడంతో ఈ పోస్టుకు బాగా డిమాండ్ పెరిగింది. ఈ విషయమై జిల్లా పాలనాధి కారులు దృష్టి సారించి నిబంధన లకు అనుగుణంగా జిల్లా సైన్స్ అధికారి నియామకం చేపట్టాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి. ఈ వ్యవహారంపై డీఈవోతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన విముఖత వ్యక్తం చేశారు.

- రూ. కోట్లలో నిధులు



- పాఠశాలకు డుమ్మా

ఈ పోస్టులో నియమితులైనవారు తమ పాఠశాల విధులు నిర్వర్తిస్తూనే అదనంగా సైన్స్ అధికారి విధులు కూడా నిర్వర్తించాలి. అయితే బాధ్యతలు చేపట్టిన వారు పాఠశాలకు డుమ్మాకొట్టి సైన్స్ అధికారిగానే చలామణి అవుతూ ఐదేళ్లు గడిపేశారు. ఇందుకు గతంలో జిల్లాలో వివాదాల డీఈవోగా గుర్తింపు పొంది, ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ ఉన్నతాధికారిగా చలామణి అవుతున్న ఓ అధికారి అండదండలే కారణమని ఉపాధ్యాయ వర్గాలు చెప్తుతున్నాయి. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం రాదన్న విషయాన్ని పసిగట్టిన ఆ అధికారి తన పదవిని స్వచ్ఛందంగా వదిలేసి తన పాత ఉపాధ్యాయ విధుల్లో చేరారు. దీంతో డీఈవో ఈ పోస్టులో వేరే ఉపాధ్యాయురాలిని నియమించేందుకు ప్రయత్నించగా, ఆమె తనకు ఆ బాధ్యతలు వద్దని, ఇబ్బందికరమైన పరిస్థితుల్లో తనను ఇరికించవద్దని కోరారు. దీంతో ఈ పోస్టును కైవసం చేసుకునేందుకు కొంతమంది పెద్ద ఎత్తున లాబీయింగ్‌కు సిద్ధమవడంతో పాటు విద్యాశాధికారిని కూడా ఒప్పించినట్లు సమాచారం.



సింహ వాహనంపై చాముండేశ్వరిదేవి

ఇందుకూరుపేట, జూన్ 16 : మండలంలోని గంగపట్నంలో గల చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సింహ వాహనంపై అమ్మవారు గంగపట్నం పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి బండి శాంతయ్య, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏఈవోల సంఘం అధ్యక్షుడిగా శేషాద్రి

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 16 : ఉమ్మడి శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో) సంఘం అధ్యక్షుడిగా సీహెచ్ శేషాద్రి ఎన్నికయ్యారు. ఆదివారం నెల్లూరులోని జిల్లా వనరుల కేంద్రంలో ఆ సంఘం ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా హరిబాబు, కోశాధికారిగా భార్గవ్, సహఅధ్యక్షుడు, ఉపాధ్యక్షులుగా గోపీకృష్ణ, చంద్రశేఖర్, విజయకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుబ్బారావు, ప్రచార కార్యదర్శిగా శ్రావణి, సంయుక్త కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, అనిత, కార్యవర్గ సభ్యులుగా శివనాగరాజు, శిరీష, అనూష ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, సహ ఎన్నికల అధికారిగా రాష్ట్ర కోశాధికారి సుభానీ, పరిశీలకుడిగా గుంటూరు జిల్లా అధ్యక్షుడు సురేష్ వ్యవహరించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఏఈవోల సమస్యల పరిష్కారానికి త్వరలో నూతన ప్రభుత్వంతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పోస్టింగ్‌ల కోసం ఎదురుచూపు

- పొరుగు జిల్లాలకు వెళ్లిన ఎంపీడీవోలు
- మూడు, నాలుగు రోజుల్లో ఉత్తర్వుల రాక?

నెల్లూరు(జడ్పీ), జూన్ 16: ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవోలు తిరిగి సొంత స్థలాలకు వచ్చేందుకు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 46 మండలాల ఎంపీడీవోలను ఎన్నికలకు ముందు చిత్తూరు, ప్రకాశం, కడప జిల్లాలకు ఎన్నికల సంఘం బదిలీ చేసింది. అప్పటి ఎంపీడీవోలు స్థానికంగా ఎన్నికలు నిర్వహించకూడదన్న నిబంధనలకు అనుగుణంగా ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎంపీడీవోలను ఎన్నికల సంఘం నియమించింది. దీంతో గత మూడు నెలలుగా బయట జిల్లాల ఎంపీడీవోలే కొనసాగుతున్నారు. అయితే ఎన్నికల ప్రక్రియ ముగియడం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో స్వస్థలాలకు వచ్చేందుకు వారంతా వేచి చూస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీవోలను యథాస్థానాలకు పంపుతూ జీవో జారీ చేయాల్సి ఉంది. దీని కోసం వారంతా ఎదురు చూస్తున్నారు. మరో మూడు, నాలుగు రోజుల్లో బదిలీల ఉత్తర్వుల జీవో జారీ అయ్యే అవకాశం ఉండడంతో పాత ఎంపీడీవోలంతా పూర్వ స్థానాలకు రానున్నారు.



- ముమ్మరంగా పైరవీలు


రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కూలిపోవడం, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎంపీడీవోలు అనుకూలమైన మండలాలకు వచ్చేందుకు ముమ్మరంగా పైరవీలు చేసుకుం టున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే, మండలస్థాయి నాయకులను కలిసి ప్రాధాన్యత కలిగిన మండలాల్లో తమకు పోస్టింగ్ ఇవ్వాలని, ఇందుకు సిఫార్సు లేఖను ఎమ్మెల్యే నుంచి ఇప్పించాలని కోరుతున్నారు. అలాగే ఏ మండలానికి ఎవరెవరిని వేసుకోవాలన్నా కసరత్తును కొంతవరకు ఎమ్మెల్యేలు, నేతలు చేసినట్లు సమాచారం. అయితే జిల్లా నుంచి బదిలీ అయిన ఎంపీడీవోలు తొలిగా యథాస్థానాలకే వచ్చే అవకాశముంది. గతంలోనూ ఇదే ప్రక్రియ కొనసాగింది. యథాస్థానాల్లో బాధ్యత చేపట్టిన అనంతరం బదిలీలను ప్రభుత్వం చేపట్టే అవకాశం ఉంది. అప్పుడు ఎంపీడీవోలు కోరుకున్న స్థానాలకు మారే అవకాశముంటుంది.

- స్తంభించిన పాలన

ఎంపీడీవోల బదిలీలతో పాలన పూర్తిగా ఆగిపోయింది. తాత్కాలికంగా వచ్చిన ఎంపీడీవోలు పాలనకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోలేమని తేల్చిపారేశారు. దీంతో ఎంపీడీవో కార్యాలయాల్లో గత మూడు నెలలుగా పరిపాలన పూర్తిగా స్తంభించిపోయింది. పాత ఎంపీడీవోలు తిరిగి వచ్చాక పాలన ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

సమస్యలు కోకొల్లలు..!

- ఉదయగిరి నియోజకవర్గంలో ప్రధానంగా సాగు, తాగునీటి కష్టాలు
- సవాల్‌గా మారిన దీర్ఘకాలిక ఇబ్బందులు
- ఉపాధి లేక వలస పోతున్న జనం



గండిపాళెం జలాశయం

ఉదయగిరి రూరల్, జూన్ 16: నియోజకవర్గంలో ప్రధానంగా సాగు, తాగునీటి సమస్యలు దీర్ఘకాలికంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో బంగారం పండే భూములున్నా సాగునీటి వసతి లేక భూములు బీళ్లుగా మారాయి. నియోజకవర్గంలోని ఏకైక జలాశయం గండిపాళెం. ఈ జలాశయం కింద వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో 16వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో జలాశయానికి కనీసం నిర్వహణ నిధులు కూడా మంజూరు చేయలేదు. గేట్లు, తూములు మరమ్మతులకు నోచుకోకపోవడంతో లీకేజీలు అధికం. జలాశయం ప్రారంభం నుంచి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించిన దాఖలాల్లేవు. జలాశయాన్ని ఆధునికీకరించి పూడిక తీయిస్తే మరో 10వేల ఎకరాలు సాగులోకి వస్తోంది. వెలుగొండలో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల హైలెవల్ కెనాల్ పనులు పూర్తయితే సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటే గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు పడరానిపాట్లు పడుతుంటారు. ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు శుద్ధిజలం అందించాలనే లక్ష్యం తో గండిపాళెంలో రూ.7కోట్లతో ఏర్పాటు చేసిన రాజీవ్ టెక్నాలజీ మిషన్ నిరుపయోగంగా మారింది. ప్రజలకు శుద్ధిజలం అందించేందుకు 2018 టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యమైంది.



అధ్వానంగా ఉన్న ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్ రోడ్డు

● పర్యాటక కేంద్రంగా దుర్గం..

శత్రు దుర్భేద్యమైన కోటలు.. ఎత్తయిన ప్రాకారాలు.. అలనాటి శిల్పకళా నైపుణ్య గుర్తులు పంచే ఆలయాల ఆనవాళ్లతో చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉదయగిరి చరిత్రపుటల్లో చిరస్థాయి పేరు లిఖించుకుంది. క్రీ.శ 10వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు చోళులు, పల్లవులు, రెడ్డిరాజులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబులు పాలన ఉదయగిరిలో కొనసాగినట్లు చరిత్ర ఆధారాల ద్వారా తెలుస్తోంది. అలాంటి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతోంది.

● పట్టణంలోని సమస్యలు..

ఇరుకైన రోడ్లు, అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్లపైనే పారుతూ దుర్గంధం వస్తుంది. మురుగునీటిలో రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. దీనికితోడు పట్టణంలో తాగునీటి సమస్యతో పట్టణ ప్రజలు అల్లాడుతున్నారు. అలాగే ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రాంత రోగులకు ఎంతోమేలు చేకూరుతుంది. దీనికి తోడు నియోజకవర్గంలో 40శాతం మంది ప్రజలు పొట్టచేతపట్టుకొని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. వింజమూరు, ఉదయగిరి ప్రాంతంలో చిన్నపాటి పరిశ్రమలు స్థాపిస్తే యువత ఉపాధి అవకాశాలు కల్పించినట్లవుతోంది.

● రహదారుల అధ్వానం..

ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్ రోడ్డు 3.2కిలోమీటర్ల మేర అటవీ అనుమతులు లేక దశాబ్దాల క్రితం నుంచి నిలిచిపోయింది. ఉదయగిరి-నందవరం రోడ్డు అధ్వానంగా ఉండడంతో అరగంట ప్రయాణానికి ఒకటన్నర గంట సమయం పడడంతో పాటు అత్యసవర వైద్యం కోసం వెళ్లేవారు మధ్యలోనే ప్రాణాలు వదులుతున్నారు. ఈ రెండు రహదారులను పూర్తి చేయడంతో పాటు సాగు, తాగునీటి కష్టాలు తీర్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి ఆనంను కలిసిన నాయకులు

సంగం, జూన్ 16: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి నెల్లూరు వచ్చిన ఆనం రామనారాయణరెడ్డిని ఆదివారం సంగం టీడీపీ నాయకులు ఎన్.వెంకటేష్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు.

ఘనంగా గంగమ్మ ఆలయ జయంతి

సంగం, జూన్ 16: స్థానిక పెన్నానది ఒడ్డున వెలసిన గంగమ్మ ఆలయ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మతల్లికి అభిషేకాలు నిర్వహించి పూలంగిసేవ చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మకు పూజలు



నాగారపమ్మదేవికి పూజలు చేస్తున్న భక్తులు

సంగం, జూన్ 16: కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసిన నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీర, పంచామృత అభిషేకాలు చేసి పూలంగిసేవ ఏర్పాటు చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఆమనిచిరువెళ్లలో గంగమ్మ తిరునాళ్ల



అలంకరణలో గ్రామదేవత గంగమ్మ

అనంతసాగరం, జూన్ 16: ఆమనిచిరువెళ్ల గ్రామ దేవత గంగమ్మతల్లి తిరునాళను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మేకల ప్రసాద్ భక్తులకు అన్నదానం చేశారు. మేకల పెంచలమ్మ అమ్మవారికి బంగారు కళ్లు, రాచాల కేశయ్య శఠగోపం, ఎన్ వెంకటరమణ తాళిబొట్టు, వీ.ప్రసాద్ వెండి కాసులు కానుకలుగా అందజేశారు.

పంచలోహ విగ్రహాల అందజేత

గ్రామంలోని కోదండరాముని ఆలయంలో జరిగే ఉత్సవాలకు గ్రామానికి చెందిన రాచాల వెంకటేశ్వర్లు వారి కుటుంబసభ్యులు రూ.2.90 లక్షల విలువ చేసే పంచలోహ విగ్రహాలను అందజేశారు.

ఇంటి నిర్మాణ పనుల అడ్డగింపు

సంగం, జూన్ 16: స్థానిక పంచాయతీలోని మజరా గ్రామం వెంకటేశ్వరపురంలో బి.రవి అనే వ్యక్తి ఎలాంటి అనుమతి అనుమతి లేకుండా ఇరిగేషన్ స్థలంలో ఇంటి నిర్మాణానికి గుంతలు తీశారు. విషయం తెలుసుకున్న ఈవోఆర్డీ అప్పాజీ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్ ఆదివారం అక్రమ కట్టడాన్ని అడ్డుకుని నోటీసులు జారీ చేశారు. ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో ఇంటి నిర్మాణానికి ప్రయత్నాలు చేయరాదని ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా నోటీసులను ఖాతరు చేయకుండా నిర్మాణానికి గుంతలు తీయడంతో వారు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

7వ తేదీన మాదిగల ఆత్మగౌరవ సభ

వింజమూరు, జూన్ 16: జూలై 7న వరంగల్‌లో జరుగుతున్న మాదిగల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కృష్ణ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు అంబేద్కర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపల్లెలో తిరిగి జనాలకు అవగాహన కల్పించి సమీకరణకు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభించి 30 సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా రాష్ట్ర నా యకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, సుధాకర్, కిరణ్, పెం చలయ్య, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాట చెప్పాడంటే.. చేస్తాడంతే !

- వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తురక వెంకటేశ్వర్లు



సీతారామపురం, జూన్ 16: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట చెప్పాడంటే వెంటనే అమలు చేస్తాడని నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు తురక వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయంపై ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలనా పగ్గాలు చేపట్టిన మొదటిరోజే ప్రజలకు ఇచ్చిన ఐదుహామీలపై సంతకాలు చేశారని, జగన్మోహన్ రెడ్డి మాదిరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటిరోజే ప్రజాదర్బార్‌ను కూల్చి వేయడం జరిగిందని అలాంటి కక్షపూరిత రాజకీయాలు చంద్రబాబు చరిత్రలోనే లేవన్నారు. జగనన్న విద్యా కానుక పేరు మీద విద్యార్థులకు ఇచ్చే పుస్తకాలు, బెల్టులు, బ్యాగులపై జగన్ ఫొటోలు ముద్రించి ఉన్నా ప్రజాధనం 600 కోట్లు వృథా కాకూడదనే మంచి మనసుతో పంపిణీ చేయండి అని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కక్షలు, కార్పణ్యాలు లేకుండా ప్రజాపాలన చేయాలన్నదే చంద్రబాబు ముఖ్యఉద్దేశ్యమన్నారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగుల కష్టాలు తీర్చేందుకు 16,347 ఉపాధ్యాయ పోస్టులు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారని తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



ఉదయగిరిలో సరుకులు అందజేస్తున్న ముస్లిం మతపెద్దలు

ఉదయగిరి రూరల్, జూన్ 16: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలోని పేదలకు జమాతే ఇస్లాం హింద్, ఐవైఎం, ఎఫ్‌ఐవోల శాఖల సభ్యులు ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఏడాది ఆయా శాఖల ఆధ్వర్యంలో సరుకులను పంపిణీ చేయడం ఆనవాయితీ అని, అందులో భాగంగా నే ఈ ఏడాది కూడా శాఖల సొంత నిధులతో పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జమాతేఇస్లాం హింద్, ఐవైఎం శాఖల జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్, మునాఫ్ ఉన్నారు.

ఈద్గాల ముస్తాబు

ఉదయగిరి రూరల్, జూన్ 16: బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు పట్టణంలోని ఈద్గా మైదానంతో పాటు మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, దాసరిపల్లి, బిజ్జంపల్లి, అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పలు ఈద్గాల వద్ద షామియానాలు, మంచినీరు, సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో అడవిపేరంటాలమ్మ ఉత్సవాలు



గొడుగుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి, జూన్ 16: గన్నేపల్లి పంచాయతీలో అడవిపేరంటాలమ్మ ఉత్సవాలు ఆదివారం రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత మిట్టపల్లి గ్రామం నుంచి గొడుగుల ఉత్సవం మేళతాళాలతో ప్రారంభమై గడ్డంవారిపల్లి రామాలయానికి చేరుకొంది. అక్కడ అమ్మవారికి నైవేద్యం తయారు చేసి కొమ్ము, డప్పువాయిద్యాలతో అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఉంచి ఆలయం వద్దకు తరలించారు. కార్యక్రమాలకు గడ్డంవారిపల్లి, మిట్టపల్లి, జెట్టివారిపల్లి, కొట్టాలపల్లి, సర్వరాబాదు, గన్నేపల్లి, బీసీ కాలనీవాసులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

వేములపాటిని కలిసిన జనసేన నాయకులు



వేములపాటిని సన్మానించిన జనసేన నాయకులు

ఉదయగిరి రూరల్, జూన్ 16: జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్‌ను నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆదివారం నియోజకవర్గానికి చెందిన పలువురు జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల సమయంలో పార్టీ గెలుపునకు చేసిన కృషిని నాయకులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజక వర్గంలో అన్ని అభిప్రాయాలు తీసుకున్న తరువాత ఇన్‌చార్జి నియామకం చేపడతామని ఆయన తెలిపినట్లు చెప్పారు. అనంతరం ఆయన్ను నాయకులు సన్మానిం చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి అలూరి రవీంద్ర, నాయకులు కమతం శ్రీనివాసు లు, నిమ్మగడ్డ రామచైతన్య కుర్ర కృష్ణయాదవ్, పెట్లు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలం బుజ్జిరెడ్డికి ఘననివాళి



కాలం బుజ్జిరెడ్డికి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఆత్మకూరు, జూన్ 16: పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జి రెడ్డి సంస్మరణ సభ ను నిర్వహించారు. నియోజకవర్గంలోని పలువురు పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొని ఆనయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ స్వయం సేవక్‌గా పనిచేసి పార్టీలో అంచలంచెలుగా ఎదిగి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు చేపట్టి పార్టీ పటిష్టతకు కృషి చేసిన ఆయన సేవలు మరవలేమన్నారు. కార్యక్రమంలో కర్నాటి ఆంజనేయ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, నియో జకవర్గ ఇన్‌చార్జ్ కంది మల్లికా ర్జునరెడ్డి, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్, అల్లంపాటి రమణారెడ్డి, నియో జకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్, కర్నాటి రవీంద్రా రెడ్డి పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

హామీల అమలుకు చంద్రబాబు శ్రీకారం

- కావలి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా
- ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 16: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం కూటమి నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల భర్తీ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తప్ప వైసీపీ పాలనలో ఒక్క పోస్ట్ భర్తీ చేయలేదన్నారు. టీడీపీ హయాంలో 2016లో 8,926, 2018లో 7,902 భర్తీ చేయగా ప్రస్తుతం 16,347 పోస్టులు భర్తీ చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. అలాగే రైతుల ఆస్తుల రక్షణ కోసం ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్ రద్దు చేసి రైతుల పక్షపాతిగా నిలిచారన్నారు. జిల్లా నుంచి పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలకు ప్రాధాన్యత కలిగిన మంత్రి పదవులు ఇచ్చారని, వారికి అభినందనలు తెలిపారు. కావలి నియోజకవర్గానికి సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రతి ఒక్కరి రుణం తీర్చుకునేలా అభివృద్ధి చేసి చూపుతానని తెలిపారు. దుర్మార్గాలకు, అన్యాయాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించేలా పాలన ఉంటుందన్నారు. ఏ ఒక్కరికి హానీ జరుగకుండా ఎవరికి అన్యాయం జరిగినా వారికి టీడీపీ, జనసేన, బీజేపీ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమించినా, అన్యాక్రాంతం చేసినా, దుర్వినియోగ పరిచినా తాను రక్షణగా ఉండి కాపాడుతానన్నారు. తనను కలిసేందుకు వచ్చే వారు బొకేలు, శాలువలు, పూలమాలలు తీసుకుని రావద్దని, అభిమానంతో వస్తే సరిపోతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పొతుగంటి అలేఖ్య, గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, తిరువీధి ప్రసాద్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు కే.బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలి

జీవో నెంబరు 117ను రద్దు చేసి విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో కలిసి సత్కరించి ఉపాధ్యాయుల సమస్యలతో కూడిన వినతిపత్రం అందచేశారు. విద్యావ్యవస్థకు సంబంధించిన 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను బలోపేతలం చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్సీ త్వరగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు, బ్రహ్మయ్య, ఆనందరావు, జ్ఞానశేఖర్, కోటేశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలి

- ఎమ్మెల్యే ఇంటూరికి హేతువాద సంఘం ప్రతినిధుల విజ్ఞప్తి



ఎమ్మెల్యే ఇంటూరికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీటీఏ నేతలు

కందుకూరు, జూన్ 16: గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారి పక్కన దొంగస్వామి రామదూత ఆశ్రమం కోసం ఆక్రమించిన స్థలాన్ని తక్షణం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కోరారు. ఆదివారం ఆయన కందుకూరులో ఎమ్మెల్యేని కలిసి మూడున్నరేళ్ల క్రితం రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని సంబంధిత అధికారులకు జారీ చేసిన ఆదేశాల ప్రతులను అందజేశారు. ఆయన వెంట జిల్లా హేతువాదసంఘం ప్రతినిధులు మొగల్ కాలేషాబేగ్, మాచర్లరావు తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల అభినందన

కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావును రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు ఉదయం బడేవారిపాలెంలోని నాగేశ్వరరావు స్వగృహానికి వెళ్లి ఆయనను సత్కరించి పూలబొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఆర్‌వీ, చిమ్మిరి నరసింహం, రాంబాబు, రమణమ్మ, మాలకొండయ్య, కృష్ణారావు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. అలాగే కందుకూరులోని కార్యాలయంలో బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) ఉపాధ్యాయులు ఇంటూరిని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి బుద్ధుని ప్రతిమను అందించారు. కార్యక్రమంలో కందుకూరు డివిజన్ బీటీఏ నాయకులు కళ్లగుంట మోహనరావు, కట్టా రమేష్, సంగా మహేంద్ర, రమణయ్య, శ్రీనివాసులు, దేవూరి శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు. కోటారెడ్డి నగర్‌కు చెందిన టీడీపీ నాయకులు అశోక్, చల్లా హరిబాబు తదితరులు నాగేశ్వరరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా లింగసముద్రం మండలం వీఆర్ కోటకు చెందిన పాటిబండ్ల మాల్యాద్రినాయుడు ఆహ్వానం మేరకు ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం అలవలపాడు వద్దగల గంగమ్మ దేవాలయంలో నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, వంకాయలపాటి మాల్యాద్రి, ముప్పరాజు లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి



నూతనంగా ఎన్నికైన సభ్యులతో నాయకులు

గుడ్లూరు, జూన్ 16 : భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి అల్లాడి రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుడ్లూరులో ఆదివారం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం సాధారణ సమావేశం సీఐటీయూ నేత కొట్టే వెంకయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి 2000 కోట్లు కార్మిక నిధిని పక్కదారిపట్టించిందని, దీంతో కార్మికులకు అందాల్సిన పరిహారాలు, పెండింగ్ కేసులు కూడా పరిష్కారం కాక నిలిచిపోయాయన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం సంక్షేమ బోర్డుకు నిధులు సమకూర్చి, భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం 18 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొట్టే వెంకయ్య, అధ్యక్షుడిగా కందుల బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులుగా గుండెమడుగుల పోతురాజు, చలంచర్ల రంగయ్య, కార్యదర్శిగా చిట్యాల హనుమంతరావు, కోశాధికారిగా రేణమాల వెంకటేశ్వర్లు, సభ్యులుగా గుండెమడుగులు శ్రీను, కొండయ్య, నందిపాటి వెంకయ్య, కొండాబత్తిన మాల్యాద్రి, కందుల బుల్లెయ్య, చలంచర్ల మల్లికార్జున రావు, ఏలూరి మాల్యాద్రి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తడకలూరి ఓంకార్, ఎసుబ్బయ్య, సీపీఎం నేత మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, కృష్ణమాదిగల చిత్రపటానికి పాలభిషేకం



పాలభిషేకం చేస్తున్న దివ్యాంగులు

కావలిటౌన్, జూన్ 16: ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగల చిత్రపటాలకు దివ్యాంగులు పాలభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చేవూరి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభవంతులకు రూ.6,000కు పెన్షన్ పెంచడం దివ్యాంగుల్లో ఆనందాన్ని నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాటసమితి నాయకురాలు నాగమణి, గొడిపేరు కొండయ్య, జానకి, కత్తి శివయ్య పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణ

లింగసముద్రం, జూన్ 16 : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చొరవతో రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా ఉన్న భారీ మంచినీటి పథకాల నుంచి మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. శుక్రవారం అర్ధరాత్రి రాళ్లపాడు కుడి కాలువ వద్ద ఉన్న 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసేందుకు దొంగలు యత్నించిన విషయం తెలిసిందే. ఈ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో భారీ మంచినీటి పథకాలైన గుడ్లూరు ఫేస్-1, 2, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాల ద్వారా శనివారం ఉదయం నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని కందుకూరు గ్రామీణ నీటి సరఫరా డీఈ రామ్మోహన్‌రావు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నెల్లూరు ఎస్ఈతో మాట్లాడి మరో ట్రాన్స్‌ఫారమ్‌ను తెప్పించారు. డీఈ రామ్మోహన్‌రావు, ఏఈలు రాజశేఖర్, ఏఈ షేక్ ఫిరోజ్‌లు ఆదివారం ఉదయం ట్రాన్స్‌ఫారమ్‌ను ప్రాజెక్టు వద్ద బిగింప జేసి మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు



కుంకుమతో వేసిన గంగమ్మ ప్రతిమ

బిట్రగుంట, జూన్ 16: బోగోలు మండలం గంగిటిప్పపై వెలసిన గంగమ్మకు ఆదివారం గ్రామ పొంగళ్లు పెట్టారు. ఐదేళ్లకు ఒక్కసారి బోగోలు యాదవపాలెం వాసులు ఐదు రోజుల పాటు పోలేరమ్మ, గంగమ్మల తిరునాళ్ల నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది ఈ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, రాజ్యలక్ష్మి దంపతుల ఆహ్వానం మేరకు కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాళ్ల సుబ్రహ్మణ్యం యాదవ్, బీజేపీ రాష్ట్రనేత భరత్‌కుమార్ యాదవ్, కావలి టౌన్ అధ్యక్షుడు బ్రహ్మానందం, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోగిరి ప్రభాకర్‌లు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు పుచ్చకాయల సోదరులు అన్నసంతర్పణ చేశారు.

పౌష్టికాహారం పంపిణీ

బిట్రగుంట, జూన్ 16: బిట్రగుంట రైల్వే క్రీడామైదానంలో ఆదివారం క్రీడాకరులు, వాకర్స్ సభ్యులకు సత్యనారాయణ చార్యులు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అధ్యక్షుడు ఎం.స్వర్ణన్‌రాజు విలుపు మేరకు క్రీడామైదాన ప్రాంగణంలో చిన్నారులచే మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్, ఫౌండర్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు జిలానీ, శ్యాంసుధాకర్ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ భవనంలో రక్తదానం

కావలి, జూన్ 16: స్వచ్ఛంద రక్తదాత సాయిసాకేతన్ 4వ వర్థతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు, మిత్రులు ఆదివారం కావలిరెడ్‌క్రాస్ భవనంలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తండ్రి ఇంటూరి నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు లక్ష్మి, అశోక్‌కుమార్, విజిత, లోహిత్, నవీన్‌కుమార్, రాకేష్, సాయిలోకేష్, శివప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల మొక్కు చెల్లింపు

కలిగిరి, జూన్ 16: ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్ విజయం సాధిస్తే కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మకు 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకుంటానని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాకు మహేష్ మొక్కుకున్నారు. ఎన్నికల్లో కాకర్ల అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో ఆదివారం మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి నేతృత్వంలో టీడీపీ నాయకులు 101 టెంకాయలు కొట్టి గ్రామదేవతకు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఊసా మాల్యాద్రి, ఇంగ్లే కల్లయ్య, కల్లూరు చంద్రమౌళి, నిశ్శంకర సురేష్, లెక్కల రాంబాబు, జీరాచిన అంకిరెడ్డి, పెద అంకిరెడ్డి, కర్నాటి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

గుడ్లూరు, జూన్ 16 : మండలంలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో ప్రతిభ చాటిన 15 మంది విద్యార్థులకు గుడ్లూరుకు చెందిన యశ్వంత్ సాయి తేజ మెమోరియల్ ట్రస్ట్ వారి ఆధ్వంలో ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. స్థానిక అభ్యుదయ పాఠశాలలో ఆ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు అజయ్‌బాబు తన కుమారుడి పేరుతో నిర్వహిస్తున్న ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుడ్లూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పీవీ రామ్మోహన్ రావు, అభ్యుదయ కరెస్పాండెంట్ కళగారెడ్డి, బసిరెడ్డిపాలెం హెచ్ఎం వెంకటేశ్వర్లు, రావూరు రాజమాత ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫణీంద్ర, ప్రతిభా కళాశాల ప్రిన్సిపాల్ ఏసుబాబు, శ్రీచైతన్య కరెస్పాండెంట్ సోమానాయుడు, హైస్కూల్ ఉపాధ్యాయులు రవీంద్ర, పద్మవతి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకర్ నాయుడుకి సన్మానం

కావలిటౌన్, జూన్ 16: ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీహెచ్‌పీడబ్ల్యూ)ఆధ్వర్యంలో ఆదివారం వైద్యరత్న డాక్టర్ ప్రభాకర్ నాయుడును గ్రామీణ వైద్యులు ఘనంగా సత్కరించారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు రమణయ్య మాట్లాడుతూ డాక్టర్ ప్రభాకర్ నాయుడు గ్రామీణ వైద్యుల గౌరవాధ్యక్షుడుగా సుదీర్ఘకాలంపాటు గ్రామీణ వైద్యులకు అండదండలందిస్తు అన్నివిధాలా వైద్య సహాయ సహకారాలు సలహాలు అందిస్తున్నారన్నారు. ఆయన 87వ జన్మదినం జరుపుకోవడం ఆనందదాయకమని గ్రామీణ వైద్యులకు ఆయన సహాయ సహకారాలు మరింత కాలం అందించాలని అభిలాషించారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, ప్రసాదరావు, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట రైల్వేని కాపాడుకుందాం

బిట్రగుంట, జూన్ 16: బిట్రగుంట రైల్వే కార్యాలయాల తరలింపును అడ్డుకునేందుకు స్థానికులు కలిసికట్టుగా రావాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడు షేక్.నూరుద్దీన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం బోగోలు బజారు కూడల్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి రైల్వే ఎల్సీగేట్ 144 వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కొర్రా చంద్రశేఖర్, జైభీం రవిచంద్ర, జహీర్, రాజారత్నం, బిట్రగుంట వాకర్స్ సభ్యులు శ్రీనివాసులు, జిల్లానీబాషా, ఎం.ఓంశ్రీనాయుడు, భాగ్యరాజ్, ఆరోగ్యరాజు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు అభినందనలు

కొండాపురం, జూన్ 16: పాఠశాల విద్యారంగాన్ని చక్కబెడతానని ప్రకటించిన విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ డేగ మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. పాఠశాలల్లో అస్తవ్యస్త పరిస్థితులను సరిచేసి గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జీవో నెంబరు 117తో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. బోధనారంగంలో ఒత్తిడిని కలుగచేస్తున్న యాప్‌లను తొలగించాలని పేర్కొన్నారు.